శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## రెండేళ్ల ప్రగతిపై ప్రత్యేక సమావేశం



**కోవూరు, జూన్ 17(ప్రభాతవార్త :** కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో బుధవారం కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కోవూరు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈకార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిని పార్టీ నేతలు పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు సంబంధించిన కూటమి నేతలు , పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ట్రాన్స్ఫార్మర్ల దొంగతనం కేసులో ముగ్గురు అరెస్టు

**చిల్లకూరు, జూన్ 17, (ప్రభాతవార్త** (ట్రాన్స్ఫార్మర్ల దొంగతనం కేసులో గూడూరు రూరల్ మండలం వెందోడు గ్రామానికి చెందిన గుంజి శ్రీహరి, వస్సేరు విజయ్ కుమార్, యనమల హరికృష్ణలను చిల్లకూరు ఎస్సై అరెస్టు చేసి గూడూరు కోర్టు నందు హాజరపరిచారు. కోర్టు వారు పై ముగ్గురు ముద్దాయిలకు 14 రోజులు రిమాండ్‌ను విధించినారు

## కావలిలో రూ.3కోట్లకు పైగా అభివృద్ధి పనులకు శ్రీకారం

### ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలలో పాల్గొన్న ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి





**కావలి, జూన్ 17 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు, నెల్లూరు ఎంపి వేమిరెడ్డి ప్రబాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిలు కలసి బుధవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూరనతయిన పనులను ప్రజలకు అంకింతం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పోలేరమ్మ గుడి నుంచి పాత శివాలయం వరకు రూ.72లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసిరోడ్లు, డ్రైనేజి పనులకు వెంకటేశ్వర హాలు నుంచి కలుగోళమ్మ దేవస్థానం వరకు రూ.1.30కోట్లు వ్యయంతో చేపట్టనున్న సిసిరోడ్డు, కెనాల్‌పై స్లాబ్ నిర్మణ పనులను ప్రారంభించారు. 29వ వార్డు ఐడిఎస్ఎంటీ బాపూజినగర్‌లో రూ.కోటి వ్యయంతో నిర్మించిన సిసిరోడ్డును ప్రారంభించగా బాలక్రిష్ణారెడ్డి నగర్‌లో ఎంపిఎల్‌సీడ్స్ నిధులతో రూ.30లక్షల వ్యయంతో నిర్మించిన సిసిరోడ్డును ప్రజలకు అంకితం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మంత్రి నారాలోకేష్ ఆశీస్సులు మరియు సహకరాంతో నియోజకవర్గంలో వేగవంతమైన అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. గత రెండేళ్ళ కాలంలో నియోజకవర్గంలో మౌలిక వసతల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి కావలి పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే దిశగా ముందుకు వెలుతామని తెలిపారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారం వల్లే అనేక అభివృద్ధి కార్యక్రమాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. కనకపట్నం ప్రాంత అభివృద్ధి బీపీసీఎల్ వంటి కీలక పారిశ్రామిక ప్రాజెక్టులు రావడంలో ఎంపి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. జిల్లాకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి వంటి ప్రజానాయకుడు ఎంపిగా ఉండడం అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ప్రశంసించారు. ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించడంలో ఎమ్మెల్యే ఎల్లప్పుడూ ముందుంటున్నారని అన్నారు.

ఎంపి కావలి అభివృద్ధికి తన సహాకరం ఎల్లప్పుడూ కొనసాగుతుందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సిఎం చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల ఫలితాలు గ్రామాలు, పట్టణాల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీఓ ఎలీషాబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, టిడిపి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్, ఏఎంసి ఛైర్మెన్ పోతుగంటి అలేఖ్య, టిడిపి నేత జనిగర్ల మహేంద్ర యాదవ్, 9వ వార్డు అధ్యక్షులు తుమ్మల క్రిష్ణ, ఏఎంసి డైరెక్టర్ తుమ్మల రమణమ్మ, వారుడ ఇన్‌చార్జులు, టిడిపి నాయకులు, కూటమి పార్టీ నేతలు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతి వేగవంతం

### - ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ - జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్ల



**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త - కలెక్టరేట్** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ఈ నెల 15వ తేదీ నుంచి కొనసాగుతోందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, ఓటర్లు పూర్తిగా నింపిన ఫారాలను స్వీకరించి ఆన్‌లైన్ ద్వారా డిజిటలైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్నారని తెలిపారు. జూన్ 17 సాయంత్రం 4 గంటల నాటికి జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 2,47,971 ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించబడగా, ఇది 12.56 శాతం పురోగతిగా నమోదైంది. అదేవిధంగా 2,284 ఫారాలు డిజిటలైజేషన్ చేయబడ్డాయని వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే, 114 కావలి నియోజకవర్గంలో మొత్తం 2,41,702 మంది ఓటర్లు ఉండగా 19,260 ఫారాలు (7.97శాతం) సేకరించబడ్డాయి. 115ఆత్మకూరు నియోజకవర్గంలో మొత్తం 2,17,309 మంది ఓటర్లకు గాను 33,161 ఫారాలు (15.26 శాతం), 116 కోవూరు నియోజకవర్గంలో మొత్తం 2,69,146 మంది ఓటర్లకు గాను 19,457 ఫారాలు (7.23 శాతం), 117 నెల్లూరు సిటీ నియోజకవర్గంలో మొత్తం 2,39,870 మంది ఓటర్లకు గాను 22,004 ఫారాలు (9.17 శాతం) సేకరించబడ్డాయి. అదేవిధంగా 118నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో మొత్తం 2,82,312 మంది ఓటర్లకు గాను 31,330 ఫారాలు (11.10 శాతం), 119 సర్వేపల్లి నియోజకవర్గంలో మొత్తం 2,34,393 మంది ఓటర్లకు గాను 27,306 ఫారాలు (11.65 శాతం), 120 గూడూరు (ఎస్సీ) నియోజకవర్గంలో మొత్తం 2,46,086 మంది ఓటర్లకు గాను 47,177 ఫారాలు (19.17 శాతం), 123 ఉదయగిరి నియోజకవర్గంలో మొత్తం 2,43,422 మంది ఓటర్లకు గాను 48,276 ఫారాలు (19.83 శాతం) సేకరించబడ్డాయని తెలిపారు. డిజిటలైజేషన్ ప్రక్రియలో 114కావలిలో 110, 115ఆత్మకూరులో 134, 116కోవూరులో 371, 117 నెల్లూరు సిటీలో 378, 118నెల్లూరు రూరల్లో 504, 119 సర్వేపల్లిలో 301, 120గూడూరు (ఎస్సీ)లో 223, 123 ఉదయగిరిలో 263 ఫారాలు డిజిటలైజేషన్ చేయబడినట్లు పేర్కొన్నారు. ఓటర్లు తమ వివరాలను సరిచూసుకొని, ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్‌ఓలకు త్వరితగతిన అందజేయాలని కలెక్టర్ కోరారు. సరైన, తప్పులులేని ఓటరు జాబితా తయారీలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలని ఆ ప్రకటనలో ఆయన విజ్ఞప్తి చేశారు.

## ఎరువుల కొరతను నివారించాలి

### -ఎపిఎఐఎంఎస్ యాప్‌పై రైతుల ఆందోళన
### - కౌలు రైతులకు స్పష్టమైన విధానం ప్రకటించాలని డిమాండ్ - మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



**ఆత్మకూరు,జూన్ 17,ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు అవసరమైన ఎరువులను సమృద్ధిగా అందుబాటులో ఉంచడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి విమర్శించారు. ఎపిఎఐఎంఎస్ యాప్ పేరుతో కొత్త విధానాన్ని అమలు చేస్తూ రైఉతలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సులభంగా అందాల్సిన యూరియా, డిఎపి ఎరువులుఇప్పుడు యాప్‌లు, సాంకేతిక నిబంధనల చుట్టూ తిరిగే పరిస్థితి తీసుకురావడం దురదృష్టకరమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులు, స్మార్ట్‌ఫోన్ వినియోగంపై అవగాహన లేని రైతులు అధిక సంఖ్యలో ఉన్నారని అలాంటి పరిస్థితుల్లో ఎపిఎఐఎంఎస్ యాప్‌ను బలవంతంగా అమలు చేయడం రైతులకు మరిన్ని ఇబ్బందులను తెచ్చి పెడుతుందన్నారు.కౌలు రైతులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు లేని రైతులు, ప్రభుత్వ భూములు, చెరువు లోతట్టు ప్రాంతాల్లో సాగుచేస్తున్న రైతులకు ఎరువులు ఎలా అందిస్తారో ప్రభుత్వం ఇప్పటివరకు స్పష్టత ఇవ్వలేదన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిని కార్యాలయాల చుట్టూ, ఎరువుల దుకాణాల చుట్టూ తిరిగేలా చేస్తోందని విమర్శించారు. గత వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వ హయాంలో రైతులకు ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయ సేవలనుగ్రామస్థాయికి తీసుకెళ్ళామన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. నెల్లూరుజిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో లక్షల ఎకరాల్లో సాగు జరగనున్న నేపథ్యంలో ఎరువుల నిల్వలను వెంటనే పెంచి కొరత లేకుండా సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే ఎపిఎఐఎంఎస్ యాప్ వినియోగంలో ఉన్న సాంకేతిక సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రతి మండలం, ప్రతి గ్రామంలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని కౌలు రైతులకు ప్రత్యేక విధానాన్ని ప్రకటించడంతోపాటు ఎరువుల పంపిణీలో పూర్తి పారదర్శకత పాటించాలని మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతులను ఇబ్బందులకు గురిచేసే నిర్ణయాలను వెంటనే వెనక్కి తీసుకొని వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చే చర్యలు చేపట్టాలని విక్రమ్‌రెడ్డి కోరారు.

## విజయోత్సవ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి

**ఆత్మకూరు, జూన్ 17, ప్రభాతవార్త:** రాష్ట్రప్రభుత్వం పాలన ప్రారంభమై రెండేళ్ళు పూర్తి అయిన సందర్భంగా జూన్ 19న ఆత్మకూరులో విజయోత్సవ సభ నిర్వహించేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామానారాయణరెడ్డి సన్నాహాలు చేస్తున్నారు.బుధవారం ఆత్మకూరులోని సభా వేదికైన శ్రీధర్ గార్డెన్స్ ప్రాంతాన్ని స్థానిక ఆర్‌డిఒ బి.పావనితో కలిసి పరిశీలించారు. 19న జరిగే కార్యక్రమంలో కూటమి నేతలందరిని ఆహ్వానించాలని, ప్రభుత్వ అభివృద్ధిపై క్షేత్ర స్థాయిలో పరిశీలనకు అనువుగా స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని పార్టీ నేతలకు , అధికారులకు సూచించారు. మార్కాపురం నుండి నెల్లూరుకు వెళుతున్న క్రమంలో సభా వేదికను మంత్రి ఆనం వీక్షించారు.



## రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో అగ్రగామిగా నిలిపాం

### - కోవూరు అభివృద్ధికి రూ.721.25 కోట్లతో పనులు
### - మహిళలను కించపరిచే నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి





**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో అగ్రగామిగా నిలిపామని, కోవూరు అభివృద్ధికి రూ.721.25 కోట్లతో పనులు చేపట్టామని, మహిళలను కించపరిచే నాయకులకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అన్నారు. బుధవారం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకోవడం, అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా కోవూరులో 2 ఏళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం పేరిట విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. ఈ సభకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి అధ్యక్షత వహించి ప్రసంగించారు. వేదికపై ఉన్న కూటమి నాయకులు, జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర, వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అజీజ్, తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాట నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం గత ఐదేళ్లలో రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని, ఒక్క పని కూడా చేయని పరిస్థితి నుంచి కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గాడిలో పెట్టిందని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను సూపర్ హిట్ చేసి చూపించారని అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీలోపు ఇంటి వద్దకే వెళ్లి వృద్ధులకు రూ.4,000 పెన్షన్, దివ్యాంగులకు రూ.6,000, వీల్‌చైర్ లేదా మంచానికే పరిమితమైన వారికి రూ.15,000 పెన్షన్ అందిస్తున్నామని తెలిపారు. తల్లికి వందనం పథకం కింద కుటుంబంలోని పిల్లలందరికీ ప్రయోజనం కల్పిస్తున్నామని, పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచి, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, నాణ్యమైన బ్యాగులు, పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని అన్నారు.

❖ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాల జారీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, మీ భూమి-మీ హక్కు కార్యక్రమం ద్వారా రీసర్వేలు, 22ఏ భూముల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. దీపం 2 కింద మూడు గ్యాస్ సిలిండర్లు, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు, చేనేత కార్మికులకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, మగ్గాలకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం మూసివేసిన అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా 268 క్యాంటీన్లలో రూ.5కే నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. గత ఐదేళ్లలో డీఎస్సీ నిర్వహించకపోగా, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు, 6 వేల పోలీసు కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసిందన్నారు. మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి తీసుకువచ్చి, ఇప్పటికే 6 లక్షల ఉద్యోగాలు కల్పించామని, 20 లక్షల ఉద్యోగాల లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. రూ.721.25 కోట్లతో కోవూరు నియోజకవర్గ అభివృద్ధి

❖ కోవూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 30 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన కిసాన్ సెజ్‌కు రూ. 15 వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చామని, దీని ద్వారా స్థానిక యువతకు భారీగా ఉద్యోగావకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. అలాగే షుగర్ ఫ్యాక్టరీ సమస్య పరిష్కారానికి అధికారులు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డితో కలిసి కృషి చేస్తున్నామని చెప్పారు. నియోజకవర్గంలో సుమారు రూ.721 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమం ద్వారా 323 సీసీ రోడ్ల పనులను రూ.17 కోట్లతో, 47 విలేజ్ హెల్త్ సెంటర్లను రూ.14.76 కోట్లతో, మేజర్ ప్రాజెక్టులకు రూ.17 కోట్లు, పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.55 కోట్ల పనులు చేపట్టామని, అదనంగా రూ.11 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. గ్రామీణ తాగునీటి సరఫరా, పారిశుద్ధం కోసం ఓవర్ హెడ్ ట్యాంకులు, జల్ జీవన్ మిషన్ పైప్‌లైన్లు, సీసీ డ్రెయిన్ల తో కలిపి 356 పనుల కు రూ.30.55 కోట్లు ఖర్చు చేసినట్లు వెల్లడించారు. రోడ్ల అభివృద్ధిలో భాగంగా నెల్లూరు-మైపాడు రోడ్డు రూ.48 కోట్లతో, బుచ్చి-దగదర్తి రోడ్డు రూ.28 కోట్లతో, బుచ్చి-ఊటుకూరు రోడ్డు రూ.8 కోట్లతో అభివృద్ధి చేశామని, మొత్తం 28 రోడ్లకు రూ.149.12 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ముదువర్తి-ముదువర్తిపాళెం కాజ్‌వేకు రూ.93.32 కోట్లు కేటాయించి ఇప్పటికే 40 శాతం పనులు పూర్తయ్యాయని, కాలువల పూడికతీత, కట్టల బలోపేతానికి రూ.202.49 లక్షలు ఖర్చు చేశామని తెలిపారు. విద్యుత్ శాఖలో ఆర్‌డీఎస్ఎస్ కింద రూ.112 కోట్ల పనుల్లో 70 శాతం పూర్తయ్యాయని, కుడితిపాళెం సబ్‌స్టేషన్‌కు రూ.3.22 కోట్లు, పంచేడు సబ్‌స్టేషన్‌కు రూ.3.75 కోట్లు, పీఎం సూర్యఘర్ యోజన కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.122 కోట్లు, మొత్తం రూ.268.45 కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష కింద డైట్ పల్లిపాడు కళాశాలకు రూ.13 కోట్లతో శంకుస్థాపన చేయగా, మొత్తం రూ.15.95 కోట్ల పనులు చేపట్టినట్లు తెలిపారు.

దేవాదాయ శాఖ కామన్ గుడ్ ఫండ్ కింద రూ.9.35 కోట్లు, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 12 భజన మందిరాలకు రూ.1.75 కోటి, సీఎంఆర్‌ఎఫ్ ద్వారా 900 మందికి రూ.9.21 కోట్లు, అలాగే వీపీఆర్ ఫౌండేషన్ సీఎస్ఆర్ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని పేర్కొన్నారు. కేవలం 24 నెలల్లోనే కోవూరు నియోజకవర్గంలో రూ.721.25 కోట్ల అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.మహిళలను కించపరిచే నాయకులను మహిళలే తిరస్కరిస్తారని, ప్రజలు తనను 55 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించారని గుర్తుచేశారు. మహిళలను అవమానించే వ్యాఖ్యలు చేసే ప్రతిపక్ష నాయకులపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నేత గుడివాడ అమర్‌నాథ్ చేసిన వ్యాఖ్యలను ఖండించిన ఆమె, కోవూరులో కూడా మహిళలను కించపరిచేలా మాట్లాడుతున్న నాయకుల తీరును తప్పుబట్టారు. మహిళలకు మర్యాద ఇవ్వని వారికి రాజకీయాల్లో కొనసాగే అర్హత లేదన్నారు. మహిళలను కించపరిచే నాయకులను మహిళలే తరిమి తరిమి కొడతారు అని హెచ్చరించారు. తన పేరును ఉద్దేశించి వ్యక్తిగత వ్యాఖ్యలు చేయడం రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని, ప్రజల విశ్వాసంతో ఎన్నికైన ప్రజాప్రతినిధిగా సేవ చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు. అవినీతి, కమీషన్ల రాజకీయాలు చేసే వారికి ప్రజలు ఇప్పటికే తగిన గుణపాఠం చెప్పారని, భవిష్యత్తులోనూ అలాంటి నాయకులను ప్రజలు తిరస్కరిస్తారని అన్నారు. తీరు మార్చుకోకపోతే జీవితాంతం మాజీ ఎమ్మెల్యేగానే మిగిలిపోవాల్సి వస్తుందని చెప్పారు. మహిళలను కించపరిచే ఏ నాయకుడికీ మహిళల వద్దకు వెళ్లి ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి మహిళల అండ ఉంది. మహిళల గౌరవాన్ని కాపాడే ప్రభుత్వంగా ముందుకు సాగుతామని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి స్పష్టం చేశారు.

## ఏపీఎస్పీడీసీఎల్ గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్ ఆకస్మిక తనిఖీ

### - ఏపీఎస్పీడీసీఎల్‌లో గూడూరు డిస్ట్రిక్ట్‌ను మోడల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్‌గా చేయాలని ఆదేశాలు
### - విద్యుత్ పరికరాల నిర్వహణలో నిర్లక్ష్యానికి తావులేదు - గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్‌ను స్మార్ట్ స్టోర్‌గా అభివృద్ధి చేయాలి
### - పాత పరికరాల విక్రయం, కార్మికులకు మెరుగైన సదుపాయాలపై దృష్టి



**గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని గోదాముల్లో విద్యుత్ పరికరాల నిర్వహణ అత్యంత కీలకమని ఆ సంస్థ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. నెల్లూరు సర్కిల్ పరిధిలోని గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్, ఎస్‌పీఎం షెడ్ మరియు ట్రాన్స్‌ఫార్మర్స్ రిపేర్ కేంద్రంలను ఆయన బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఎండి మాట్లాడుతూ స్టోర్స్‌లో విద్యుత్ పరికరాల నిర్వహణను క్రమబద్ధంగా చేపడుతూ వివిధ అభివృద్ధి పనులకు అవసరమైన మెటీరియల్‌ను సకాలంలో అందించాల్సిన బాధ్యత స్టోర్స్ అధికారులపై ఉందన్నారు. గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్‌ను స్మార్ట్ స్టోర్గా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెటీరియల్ నిర్వహణలో అలసత్వం లేదా అక్రమాలు చోటు చేసుకున్నట్లు గుర్తించినట్లయితే సంబంధిత అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టోర్‌లోని ఏబీ కేబుల్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇన్సులేటర్లు, బ్రేకర్లు, క్యూబికల్స్, ఎర్త్ పైపులు, కండక్టర్లు తదితర పరికరాలను పరిశీలించి, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఇన్‌కమింగ్, అవుట్‌గోయింగ్ రిజిస్టర్లను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. పరికరాలు నిరుపయోగంగా మారకుండా వాటి వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్టోర్స్‌లో నిల్వ ఉన్న పాత పరికరాలను టెండర్ ప్రక్రియ ద్వారా ఎప్పటికప్పుడు విక్రయించేలా చర్యలు చేపట్టాలని సూచించిన సీఎండి, పరికరాల భద్రత మరియు నిర్వహణ కోసం రెండు నెలల్లోగా ప్రత్యేక ప్లాట్‌ఫామ్ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. అలాగే స్టోర్స్‌లో పనిచేస్తున్న కార్మికులకు అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణమే కల్పించాలని సూచించారు.

అనంతరం గూడూరు డివిజనల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించిన సీఎండి శివశంకర్ లోతేటి, రెవెన్యూ కలెక్షన్లను మరింత వేగవంతం చేయాలని, బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందిస్తూ, ఫిర్యాదుల పరిష్కారంలో వేగం పెంచి పాజిటివ్ పర్సెప్షన్‌ను మరింత మెరుగుపరచాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ సంస్థ ప్రతిష్ఠను పెంచే విధంగా ప్రతి అధికారి, ఉద్యోగి పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్డి) కే. గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్. రమణ, సూపరింటెండింగ్ ఇంజనీర్లు డి. తిరుమలరావు, వి. చంద్రశేఖరరావు, కే. రాఘవేంద్రం, జనరల్ మేనేజర్లు పి.వి. సుబ్బారావు, సిహెచ్. నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బాలచంద్ర, నరేంద్ర, శ్రీధర్, లక్ష్మీనారాయణ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అవ్యత వ్యాఖ్యలు తగవు



**- ప్రసన్నకుమార్‌రెడ్డి తీరు మార్చుకోవాలి: జీవన్‌శేఖర్‌రెడ్**

**కొడవలూరు, జూన్ 17 ప్రభాతవార్త:** కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి చేస్తున్న వ్యక్తిగత విమర్శలు, అవ్యత వ్యాఖ్యలు సరికాదని పార్లమెంటరీ కార్యదర్శి జీవన్శేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై చర్చించాల్సి న నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగడం బాధాకరమన్నారు. **ప్రజల తీర్పును గౌరవించాలి :**గత ఎన్నికల్లో కోవూరు ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, భారీ మెజార్టీతో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించి తమ అభిమతాన్ని చాటారని జీవన్శేఖర్‌రెడ్డి అన్నారు. ప్రజల తీర్పును అంగీకరించకుండా వ్యక్తిగత వ్యాఖ్యలకు దిగడం సమంజసం కాదన్నారు. **హుందాతనం పాటించాలి :**రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినప్పటికీ అవి హుందాతనంతో ఉండాలని సూచించారు.కుటుంబ వ్యవస్థ, సంప్రదాయాలకు సంబంధించిన అంశాలపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం ప్రజలు హర్షించరని పేర్కొన్నారు.పరస్పర గౌరవంతో రాజకీయాలు సాగాలని అన్నారు. **అభివృద్ధే లక్ష్యం :**ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని జీవన్‌శేఖర్‌రెడ్ తెలిపారు. తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, సంక్షేమ పథకాల అమలులో ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.ప్రజలే అంతిమ నిర్ణేతలు అసత్య ఆరోపణలు, వ్యక్తిగత విమర్శల కంటే ప్రజా సమస్యలపై చర్చించడమే మంచిదని జీవన్‌శేఖర్‌రెడ్ అన్నారు. ప్రజలే అంతిమ నిర్ణేతలని, వారి తీర్పును ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.

## రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో సత్తా చాటుతాం



**కావలి, జూన్ 17 ప్రభాతవార్త :** రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో 175 నియోజకవర్గాల్లో స్వతంత్రంగా పోటీ చేసి సత్తా చాటుతామని మజాఈ న్యాయమూర్తి, హైకోర్టు న్యాయవాది, జైభీమ్‌రావు భారత్‌పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్ తెలిపారు. పట్టణంలో జై భీమ్‌రావు భారత్‌పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ మైనం పాటి ఏసురత్నం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలో బారీ ర్యాలీని నిర్వహించడం జిరగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 28న ఏలూరులో సుమారు లక్షమందితో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని దళిత క్రైస్తవులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు దళిత ఓట్లు అవసరం లేదని చెబుతూనే దళిత ఓట్లతో గెలవడం ఏంటిని ప్రశ్నించారు. దళితులు క్రైస్తవులు ప్రజలు ఏ సమస్యలు వచ్చినా తెలిపాలన్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. జడ శ్రావణ్‌కుమార్‌ని పలువురు దుశ్శాలువాల, పూలమాలలతో ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు దళిత క్రైస్తవులు పాల్గొన్నారు.

## 18న ఉద్యోగులు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ డే

**- జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త - కలెక్టరేట్ :** ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 18న ఉద్యోగుల గ్రీవెన్స్ డే, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ డేను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఈ నెల 18వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నెల 18న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, సంఘాలకు ప్రత్యేక గ్రీవెన్స్ డే: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నెల్లూరు కలెక్టరేట్ లోని తిక్కన ప్రాంగణంలో ఈనెల 18వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటల నుంచి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, సంఘాలకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు, సంఘాలు తమ సమస్యలు, వినతులను నేరుగా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావడానికి ఈ ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించి ఐటీడీఏ ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు ముందస్తుగా ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు, సంఘాలకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

## టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణపై విస్తృత అవగాహన పెంచాలి

## నెల్లూరు ఆర్డీఓ ఎస్. అనూష




**నెల్లూరు సిటీ, జూన్ 17, ప్రభాతవార్త :** మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణ అంశంపై అంగ న్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఎస్‌హెచ్‌జి (ఎస్‌హెచ్‌జి) గ్రూపు సభ్యులు మరియు సూపర్వైజర్లకు బుధవారం నెల్లూరు ఆర్డీవో కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో ఎస్. అనూష మాట్లాడుతూ జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ కేసులను తగ్గించేందుకు క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణాలు, స్లమ్ ప్రాంతాలలో ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు టీనేజ్ ప్రెగ్నెన్సీ వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, విద్యాపరమైన దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులను కూడా ఈ కార్యక్రమాలలో భాగస్వామ్యం చేయాలని సూచించారు ఈ సందర్భంగా జిల్లా బాలల సంరక్షణ అధికారి బి సురేష్ మాట్లాడుతూ చైల్డ్ మ్యారేజ్ గురించి, చైల్డ్ మ్యారేజ్ నష్టాలు గురించి చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 గురించి, బాలలకు ఎటువంటి సమస్య వచ్చినా ఈ నెంబర్‌కు కాల్ చేసిన వెంటనే ప్రభుత్వం నుంచి సహాయం అందుతుందని తెలియజేయడం జరిగింది. పోలీసు శాఖ ఎస్ఐ అనిల్ రెడ్డి మాట్లాడుతూ పోక్సో చట్టం, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు మరియు వాటి అమలుపై అవగాహన కల్పించగా, డిప్యూటీ ఎంపీడీవో పద్మజ టీనేజ్ ప్రెగ్నెన్సీ నివారణకు తీసుకోవాల్సి న చర్యలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో పద్మజ, ఎస్ఐ అనిల్ రెడ్డి, ఏహెచ్‌టియు ఎఎస్ఐ శ్రీహరి, జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీఓ)బి. సురేష్, ఐసీపీఎస్ సిబ్బంది, ఐసీడీఎస్ సీడీపీఓలు,సూపర్వైజర్లు,అంగన్వాడీ కార్యకర్తలు,ఆశా వర్కర్లు ఎస్‌హెచ్‌జి సభ్యులు పాల్గొన్నారు.

## చేపట్టే పనుల్లో నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి



**కోవూరు, జూన్ 17ప్రభాతవార్త :** కోవూరు మండలం ఇనమడుగు , వేగూరు గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను బుధవారం ఎంపీడీవో శ్రీహరిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆన్‌లైన్‌లో ఉపాధి హామీ పథకం కూలీల హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేపడుతున్న ఈ పనులు నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో పాటు సకాలంలో పూర్తి చేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. చేపట్టే పనులకు సంబంధించి కూలీల శాతాన్ని పెంచాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## బిసి రిజర్వేషన్లపై సమీక్ష సమావేశం



**కావలి, జూన్ 17 ప్రభాతవార్త :** గ్రామీణ, పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం, సమీక్ష సమావేశం బుధవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయ సమావేశపు మందిరంలో జరిగి ంది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా విశ్రాంత ఏపి రాష్ట్ర డెడికేటెడ్ కమిషనర్ రాజీవ్ రంజన్ మిశ్రా పాల్గొని కావలి డివిజన్‌లోని వివిధ శాఖల అధికా రులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సర్వేని నిష్పక్షపతంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా బిసి వేల్ఫేర్ అధికారి వెంటక లక్ష్మమ్మ, ఆర్డీఓ ఎలీషాబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఎంపిడిఓ ముజీఫర్ రహీం, డివిజన్ ఏబిసిడ బ్యుఓలు, హెచ్‌డబ్ల్యుఓలు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

## నిత్యవసర వస్తువులు బియ్యం, కూరగాయలు పంపిణీ



**కావలి, జూన్ 17 ప్రభాతవార్త :** పట్టణంలోని తుఫాన్ నగర్‌లో సంయుక్త సేవాసంస్థ కార్యాల యంలో దత్తత తీసుకొన్న 20 కుటుంబాలకు నిత్యావసర వస్తు వులు, బియ్యం, కూరగా యల ను బుధశారం పంపిణీ చేశారు. సంస్థ సంరక్షణలో ఉన్న దుర్గాపా వనికి కళాశాలకు వెళ్లేందుకు సైకిల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సేవాసంస్థ వ్యవస్థాపకురాలు నాట్యగురువు లిఖిత మాట్లాడుతూ తమ సంస్థకు నెల నెలా సాయం అందజేస్తున్న దాతలకు, పేద విద్యార్థులను, వృద్ధులను, దివ్యాంగులను దత్తత తీసుకున్న దాతలకు ధన్యవాదాలు తెలిపారు. దాతలు ముందుకు వచ్చి సహకారం అదిస్తే మరిన్ని సేవలు అందిస్తామని అన్నారు. పేదలకు నిత్యవసర వస్తువులు, బియ్యం, కూరగాయలు పంపిణీ ఆర్థికసాయాన్ని అందజేసిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు సురేంద్ర, అర్షియా తదితరులు పాల్గొన్నారు.

## నివాసాల మధ్యలో సెల్ టవర్ వద్దు



**బుచ్చి జూన్ 17 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలోని 7,8 వార్డుల పరిధిలో ఉన్న శివసాయి లౌఔట్‌లో ఎయిర్‌టెల్ సెల్ టవర్ ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలు స్థానికంగా వివాదానికి దారి తీశాయి. నివాస ప్రాంతాల మధ్యంలో టవర్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనపై కాలనీ వాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తు పనులను అడ్డుకున్నారు. సెల్ టవర్ వల్ల ఆరోగ్యపరమైన పర్యావరణపరమైన సామాజిక పరమైన సమస్యలు తలెత్తె అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల కథనం ప్రకారం జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాలలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల నిరంతరం వెలువడే విద్యుత్ అయస్కాంత తరంగాలు చిన్నారులు,వృద్ధులు, గర్భిణిలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారిపై ప్రభావం చూపే అవకాశం ఉందని భయపడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా సెల్ టవర్ రేడియేషన్ ప్రభావాలపై భిన్నభిప్రాయాలు ఉన్నప్పటికి ప్రజల్లో మాత్రం ఆరోగ్య ఆందోళనలు కొనసాగుతున్నాయి. అలాగే టవర్ నిర్మాణం వల్ల నివాస ప్రాంతాల సౌందర్యం దెబ్బతినడంతోపాటు ఆస్తులు విలువలు తగ్గే అవకాశం ఉందని కొందరు స్థానికులు అభిప్రాయపడుతున్నారు. తుఫాన్లు భారీ గాలులు లేదా ప్రకృతి వైపరీత్యాల సమయంలో టవర్ భద్రతపై కూడా ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఈ సమస్యను స్థానికులు తెలుగుదేశం పార్టీనాయకులు దృష్టికి తీసుకెళ్ళగా వారు ప్రజలకు మద్దతు ప్రకటించారు. స్థానికుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా టవర్ ఏర్పాటు చేయడం సమంజసం కాదని పేర్కున్నారు. సమస్యలను కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్ళి ప్రజలకు అనుకూలంగా పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామి ఇచ్చారు. కాలనీవాసులు నివాస ప్రాంతాలకు దూరంగా ఖాళీ ప్రదేశాలు లేదా వాణిజ్య ప్రాంతాల్లో సెల్ టవర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రజల అభిప్రాయాలు భద్రతా అంశాలు, సంబందిత నిబంధనలను పరిగణంలోకి తీసుకున్న తరువాతే అనుమతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## యూజీసీ నిధుల దుర్వినియోగంపై రిటైర్డ్ ప్రిన్సిపాల్ జరిమాన



**ఉదయగిరి, జూన్ 17, ప్రభాతవార్త :** యూజీసీ నిధుల దుర్వినియోగం ఆరో పణల నేపధ్యంలో ఉదయగిరి పట్టణం లోని ఎంఆర్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వర రావుపై ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యాశాఖ భారీ జరిమాన విధిస్తూ ఆయన పెన్షన్ గ్రాడ్యూటీలను శాశ్వతంగా నిలిపివేస్తూ కఠిన ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నిధుల దుర్వినియోగ వ్యవహారానికి సంబంధించి వెంకటేశ్వరరావు పదవీ విరమణ సమయానికి దుర్వినియోగం చేసినట్లు తేలినమొత్తం 26 లక్షల 77 వేల రూపాయలను ప్రభుత్వం ఇప్పటికే రికవరి చేసింది. నిధుల దుర్వినియోగం జరిగిన కాలం నుండి అవి ప్రభుత్వ ఖాతాలో లేనందుకు గాను 2024 మార్చి వరకు 4.7 శాతం వడ్డీ రేటుతో లెక్కించగా తేలిన 10.19 లక్షల వడ్డీని కూడా ఆయన నుండి రికవరి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. దుర్వినియోగమైన ఆ మొత్తం నిధులపై ఆయన ఇచ్చిన వివరణతో సంతృప్తి చెందని ఉన్నత విద్యశాఖ, ఏపీపీఎస్సీ సిఫార్సుల మేరకు ఆయనకు అందాల్సిన పెన్షన్ గ్రాడ్యూటీలను శాశ్వతంగా నిలిపివేస్తూ తుది నిర్ణయం తీసుకున్నారు.

## క్షేత్రస్థాయిలో ఎస్ఐఆర్‌పై పర్యవేక్షణ



**ఉదయగిరి, జూన్ 17, ప్రభాతవార్త :** ఉదయగిరి మండల పరిధిలోని కొండాయపాలెం సచివాలయం పరిధిలోని గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్న 41,42,53 బూత్‌లను సందర్శించి ఓటర్స్ ఫామ్ వెర్ఫికేషన్ చేయడం జరిగింది. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలన చేస్తున్న ఎస్సీ సెల్ నాయకులు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో స్థానికంగా బీఎల్ఓ నాగరాజు వైఎస్సార్‌సీపీ బీఎల్ఏ బాలబుల్‌రెడ్డి నేతృత్వంలో ఓటర్ వెర్ఫికేషన్ కార్యక్రమంలో అర్హత కలిగిన ప్రతి ఒక్క ఓటర్‌ను జాబితాలో ఉండే విధంగా చూడాలని అలాగే ఓటర్లకు ప్రతి ఒక్కరు అవగాహన కలిగి తమ కుటుంబ సభ్యులతో మీ యొక్క ఓటును జత పరుస్తూ నమోదు చేసుకోవడం ద్వారా ఓటు హక్కు లభిస్తుందన్నారు. ఓటర్లకు తెలియజేశారు. అలాగే 18 ఏళ్ల నుండి ఓటు హక్కు రానటువంటి యువ ఓటర్లను గుర్తించి ఓటు హక్కు వచ్చేవిధంగా కృషి చేయాలని బీఎల్ఓ నాగరాజును కోరారు. ఓటరు జాబితాలో కొంత మంది ఫొటోలు సరిగ్గా లేవని అందువలన ద్వారా సేకరిస్తున్న ఫొటోలను సరిగ్గా లేవని అందువలన ద్వారా సేకరిస్తున్న ఫొటోలను ఆధునీకరించి కొత్త ఓటర్ ఫొటో జాబితా తయారు చేయటం జరుగుతుందని అందుకోసం ప్రతి ఒక్క ఓటరు ఖచ్చితంగా ఫొటో అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉన్న మొదల గురవయ్య, వైఎస్సార్‌సీపీ బీఎల్ఏ బాలబుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గానుగపెంట ఓబుల్‌రెడ్డి, వీఆర్వో మాలకొండయ్య, చిన్న బాలిరెడ్డి, విలేజ్ సెక్రటరీ గానుగపెంట వెంకటేష్, సాంబశివారెడ్డి, ఓటర్లు తదితరులు పాల్గొన్నారు.

## =దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ



**ఉదయగిరి, జూన్ 17, ప్రభాతవార్త :** విద్యాశాఖ, సమగ్ర శిక్ష తరుపున దివ్యాంగ విద్యార్థులకు అలిన్‌కో వారి ఉపకరణాల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రవ ంలో ఉదయగిరి మండలానికి చెందిన 9 మంది విద్యార్థులకు టీఎల్ఎం కిట్లు అందించారు. ఒకటి ఎల్ఎం విలువ దాదాపు 8 వేల రూపాయలు చేస్తుందని, మానసికంగా ఎదుగుదలలేని పిల్లలకు ఈ కిట్లు అందజేయడం జరిగిందని ఇవి మానసిక లోపం గల విద్యార్థులకు వారి మానసిక వికసానికి తోడ్పడే విధంగా 18 రకాల ఉపకరణాలు ఈ కిట్‌లో ఉంటాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్టు డైరక్టర్ వెంకట సుబ్బయ్య,సహిత విద్య సమన్వయకర్త ప్రసాద్‌రావు, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు, ఐఆర్పీలు సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియను పరిశలించిన తహసీల్దార్



**కోట,జూన్ 17 ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరన (సర్ ) ప్రక్రియ కోట మండంలో శర వేగంగా జరుగుతుంది. ఆమేరకు బుధవారం మండల తహిసీల్దాం ్.కె.జయజయరావు 214 పోలింగ్ పరిధి లోని బిఎల్‌వోలు ఇచ్చిన ఫారాలను పరిశీల న చేశారు. ఈ సందర్బంగా జయజ యం ావు మాట్లాడుతూ ఎన్నికల సంఘం అంది ంచిన ఫారాలను సిబ్బంది ఇంటింటికి వెళ్లి అందజేస్తున్నారని చెప్పారు. వాటిలో వివరాలు పేర్కొని ఇస్తే పరిశీలించిన అనంతరం ఆన్‌లైన్‌లో నవమోదు చేయడం జరుగుతందన్నారు. నకిలీ ఓటర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు మృతుల ఓట్లను జాబితా నుంచి తొలగించడానికి వీలువుతుందన్నారు. కచ్చితమైన జాబితా రూపొందించడానికి అస్కారం ఉంటుందన్నారు. ఇంటికి తాళం వేసి ఉన్నా వివరాలు తెలుసుకునే ఒక్కో ఇంటిని మూడు సార్లు సందర్శించేలా ప్రణాళిక రూపోందించడం జరిగిందన్నారు బూత్ స్థాయి అధికారులకు బూత్ స్థాయి ఏజెంట్లు సమన్వయంతో పని చేయాలని ఆయన సూచించారు.

## పేద ప్రజల పోట్ట కొట్టే విబిజి రాంజీ చట్టాన్ని రద్దు చేయండి



**రాపూరు, జూన్ 16, ప్రభాతవార్త :** గ్రామీణ పేద ప్రజల పోట్టకొట్టే వికసిత భారత్.గ్యారంటీ ఫర్ రోజ్ గర్ అండ్ ఆజివిక మిషన్(విబిజీ రాంజీ) చట్టాన్ని రద్దు చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట సహా యక కార్యదర్శి డిపి పోలయ్య డిమాండ్ చేశారు. బుదవారం ఆయన రాపూరులో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం మహాత్మాగాంధీ జాతియ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసి గ్రామీణ ప్రాంతాల్లో పేదల ఉపాధిపై తీవ్ర దెబ్బకోట్టిందన్నారు. దీనివల్ల గ్రామాల్లో తిరిగి వలస కూలీలు ఎక్కువైతుందన్నారు.గతంలో ఈ పథకానికి 90 శాతం కేంద్రం నిధులు, 10 శాతం రాష్ట నిధులు వుండగా ఇప్పుడు 60 శాతం కేంద్రం నిధులు, 40 శాతం రాష్టాలు భరించాల్సి వుందన్నారు. దీనివల్ల పేదల ఉపాధి దెబ్బతింటుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పేదల ఉపాధిని దెబ్బకోట్టే ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేసి పాత ఉపాధి హామీ పథకం కోనసాగించాలని 200 రోజులు పనిదినాలతో పాటు, రోజు వారి కూలీ రూ.700 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## జూన్ 24న రాపూరు మండల సర్వసభ్య సమావేశం

**రాపూరు, జూన్ 16, ప్రభాతవార్త :** రాపూరు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం జూన్ 24 బుదవారం నిర్వహించనున్నట్లు యంపీడీఓ పి. వసుందరమ్మ తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కుమ్మరిగుంట ప్రసన్న అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశం ఉదయం 11 గంటలకు మండల సమావేశ మందిరంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అందరు యంపీటిసిలు, మండలంలోని అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

## ప్రతి ఒక్కరూ వారి ఓటును కాపాడుకోవాలి



**ఉదయగిరి, జూన్ 17, ప్రభాతవార్త :** ఉదయగిరి పట్టణంలో జరిగే ఎస్ఐఆర్ కార్యక్ర మంలో భాగంగా ఓట్ల వెర్ఫికేషన్ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాలతో ఉదయగిరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ దస్తగిరి అహ్మద్ ఆధ్వర్యంలో ఉదయగిరి పట్టణంలో ఉండే 10 బూత్‌ల్లో ఉన్న బీఎల్ఏలు ఉదయగిరి పట్టణంలోని పలు ఏరియాలలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో బీఎల్ఓలతో పాటుగా వెర్ఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీలు ఓసీలు అందరూ కూడా వారి ఓటును కాపాడుకోవాలని, ప్రతి ఒక్కరూ వెర్ఫికేషన్ ఫారాలు తీసుకొని వాటిపై ఫొటోలను అతికించి ఫారాలు ఫిలప్ చేసి బీఎల్ఓలకు, బీఎల్ఏల సహకారంతో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ మండల అధ్యక్షులు ఎంఏ సలీం, బిఎల్ఏలు షేక్ ఇర్షాద్, షేక్ మస్తాన్ గడ్డం హజరత్తయ్య, షేక్ పైజి, షేక్ బాబు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కన్నె మరకల పెంచలయ్య, గాజులపల్లి రామిరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఎంపిడిఓగా చిన్న చెన్నారావు



**సీతారామపురం జూన్ 17 ప్రభాతవార్త :** మండల నూతన ఎంపిడిఓగా జి . చిన్నచెన్నారావు బుధ వారం బాధ్యతలు చేపట్టారు.ఈయన మార్కాపురం జిల్లా కొమరోలు మండల డిప్యూటి ఎంపిడిఓగా పనిచేస్తు పదోన్నతిపై సీతారామపురం ఎంపిడిఓగా వచ్చారు. ఇప్పటి వరకు సీతారామపుం డిప్యూటి ఎంపిడిఓ శివప్రసాద్‌రావు ఇంచార్జి ఎంపిడిఓగా బాధ్యతలు నిర్వహించారు. నూతన ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన జి.చిన్నచిన్నారావుని డిప్యూటి ఎంపిడిఓ శివప్రసాద్‌రావు,కార్యాలయం సిబ్బంది ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు.

## మెగా ఉద్యోగ మేళాలో 112 మందికి ఉద్యోగాలు

**- మరో 20 మందికి తదుపరి ఎంపికకు అవకాశం**






**కొడవలూరు, జూన్ 17 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారంతో నార్త్ రాజుపాలెంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో బుధవారం మెగా ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ మేళాలో సుమారు 20 సంస్థలు పాల్గొని నిరుద్యోగ యువతకు ముఖాముఖి పరీక్షలు నిర్వహించాయి.ఉద్యోగ మేళాకు 210 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా, ప్రతిభ కనబరిచిన 112 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మరో 20 మందిని తదుపరి దశ ముఖాముఖి పరీక్షలకు పంపించారు. ఎంపికైన అభ్యర్థులకు ఆయా సంస్థల ప్రతినిధులు నియామక పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ఉప ప్రధానాచా ర్యరాలు డాక్టర్ ఎస్. జయలక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి షేక్ అబ్దుల్ ఖయ్యూం, సీడాప్ జిల్లా ప్రాజెక్టు నిర్వాహకురాలు పి. హైమవతి, నెల్లూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ సిబ్బంది, సీడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

## నెల్లూరు నారాయణలో ఆర్థోపెడిక్ రోబోటిక్ సర్జరీలు ప్రారంభం



**- మొట్టమొదటి రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జరీ విజయవంతం**

**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త - వైద్యం:** నెల్లూరు నారాయణలో ఆర్థోపెడిక్ రోబోటిక్ సర్జరీలు ప్రారంభించామని, మొట్టమొదటి రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జరీ విజయవంతం అయిందని నారాయణ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ పి.శ్రీనివాసుల రెడ్డి తెలిపారు. ఆధునిక వైద్య రంగంలో మరో ముందడుగు వేస్తూ నారాయణ మెడికల్ కాలేజ్ హాస్పిటల్లో అత్యాధునిక ఆర్థోపెడిక్ రోబోటిక్ సర్జరీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆసుపత్రి యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ పి. శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలలో నూతన అధ్యాయం ప్రారంభమైందని, బుధవారం నారాయణలో రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని, మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలలో అత్యంత ఖచ్చితత్వం, మెరుగైన ఫలితాలు, వేగంగా కోలుకునే అవకాశాలను అందించేందుకు ప్రపంచస్థాయి రోబోటిక్ సాంకేతికతను ఈ ప్రాంతవాసులకు అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. అనంతరం ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ బిజురవీంద్రన్ మాట్లాడుతూ సాధారణ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సను అత్యంత తక్కువ ఖర్చు కేవలం 95,000 రూపాయలకే అందుబాటులో ఉంచామని, మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో రోబోటిక్ మోకాలి మార్పిడి శస్త్రచికిత్సలను ప్రారంభించడం జరిగిందని, మొట్టమొదటి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించడం జరిగిందని తెలిపారు.ఈ రోబోటిక్ మోకాలి మార్పిడి సర్జరీ వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని, అత్యంత ఖచ్చితత్వంతో, తక్కువ రక్తస్రావం, తక్కువ నొప్పి, కండరాలు, కణజాలానికి తక్కువ నష్టం, వేగంగా కోలుకోవడం, త్వరగా నడిచే అవకాశం ఉంటుందని, పేద మధ్యతరగతి ప్రజలకు అందుటులో ఉండాలనే ఉద్దేశంతో మా ఫౌండర్ ఛైర్మన్ డాక్టర్ పి. నారాయణ ఈ అవకాశం కల్పించారని, మోకాళ్ల నొప్పులు, కీళ్ల అరిగిపోడం, నడవడానికి ఇబ్బంది, మెట్లు ఎక్కలేకపోవడం వంటి ఇబ్బందులు పడుతున్నావారు. ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. అనంతరం నారాయణ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. ప్రభావతి మాట్లాడుతూ గతంలో ఉదర సంబంధిత రోబోటిక్ సర్జరీలను ప్రారంభించడం జరిగిందని, అయితే మోకాళ్ల మార్పిడి కొరకు ఈరోజు ఆర్థోపెడిక్ రోబోటిక్ సర్జరీలను ప్రారంభించామని, ఈ సేవల కొరకు నారాయణ హాస్పిటల్ ఓ.పి బ్లాక్ లోని రెండవ అంతస్థు నందు సంప్రదించవలెనని, మరిన్ని వివరాలకు, అపాయింట్మెంట్ కొరకు 9154392476 ఫోన్ నంబరును సంప్రదించవలెనని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్య విద్యా సంస్థల కోఆర్డినేటర్, ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి డాక్టర్ బిజు రవీంద్రన్, నారాయణ మెడికల్ కళాశాల డీన్ డాక్టర్ పి. శ్రీనివాసుల రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్. ప్రభావతి, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్లు డాక్టర్ కె. హరికృష్ణారెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, అనస్థీషియా విభాగాధిపతి డాక్టర్లు కృష్ణచైతన్య, హరిత, ఏజీఎం ఎ.సి శేఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు తగవు

**- కే. రమేష్ నాయక్**



**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త - అగ్రికల్చర్ :** ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసినా, బెదిరింపులకు పాల్పడినా, విధి నిర్వహణకు ఆటంకం కలిగించినా ఉపేక్షించేది లేదని, నెల్లూరు పశు సంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ కె. రమేష్ నాయక్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం, మొగులూరు గ్రామ పశు వైద్య శాఖ కార్యాలయంలో సిబ్బందిపై దాడులకు పాల్పడిన స్థానిక రైతు భౌతిక దాడి చర్యను నిరసిస్తూ, బుధవారం నెల్లూరు పశుసంవర్థక శాఖ జెడి కార్యాలయం ముందు ఆ శాఖ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జెడి కే. శీనా నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల భద్రత, గౌరవాన్ని సంరక్షించడం సమాజం యొక్క బాధ్యత అని పేర్కొన్నారు. మొగులూరు గ్రామంలో కే. విశ్వనాథ్ పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## అరుంధతివాడ స్మశానవాటిక ఫెన్సింగ్ ధ్వంసం

**తోటపల్లి గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త :** మండలంలోని కోడూరు అరుంధతివాడలో స్మశానవాటికకు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్, హద్దురాళ్ల ధ్వంసం చేయడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ సర్వే నంబర్ 1258లో 0.38 సెంట్ల విస్తీర్ణంలో ఉన్న స్మశాన స్థలాన్ని తరతరాలుగా వినియోగిస్తున్నామని తెలిపారు.



ఇటీవల స్మశానవాటికను శుభ్రపరిచి, సుమారు రూ.1 లక్ష వ్యయంతో ఫెన్సింగ్, హద్దురాళ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అయితే కొందరు వ్యక్తులు రాత్రి వేళల్లో ఫెన్సింగ్, హద్దురాళ్లను ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై తోటపల్లి గూడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొంటూ, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, జరిగిన నష్టానికి పరిహారం అందించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

## గణితంలో జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు జయకేతనం

**వింజమూరు, జూన్ 17, ప్రభాతవార్త:** : వింజమూరు మండలంలోని గుండెమడకల జడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు గణితం పరీక్షల్లో శత శాతం సాధించి జయకేతనం ఎగరేసారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కనకారావు



పేర్కొన్నారు. బుధవారం పాఠశా లలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ తమ స్కూల్ నుండి 8 మంది విద్యార్థులు 100కి 100 మార్కులు సాధించారన్నారు. అలాగే 24 మంది విద్యార్థులు ఏ వన్ గ్రేట్ సాధించడం గర్వకారణం అన్నారు. ఇది ఉపాధ్యాయుల అంకితభావం విద్యార్థుల కఠోర శ్రమకు నిదర్శనం అన్నారు. పాఠశాలకు చెందిన ఏ గౌతమ్ సిద్ధార్థ్ సిహెచ్ సంతోష్ సిహెచ్ లాస్య జి లక్ష్మిరెడ్డి, కె శ్రీకాంత్, ఎం వనజ, యు.రుచిత్, వి. గాయత్రి నూరు శాతం సాధించారన్నారు. అలాగే 99 మార్కుల ఇద్దరూ 98 మార్కులు ఒకరు 97 మార్కుల ముగ్గురు 96 మార్కులు నలుగురు 95 మార్కులు 92 నుండి 94 మార్కులు నలుగురు 90 మార్కులు సాధించారని 26 మంది 90 ప్లస్ మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు శివకోటరెడ్డి మాట్లాడుతూ ప్రతిరోజు ప్రత్యేక తరగతులు కాన్సెప్ట్ క్లియర్ చేసి పాత ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయించామన్నారు. అనంతరం వచ్చిన విద్యార్థులను మొమెంటో, మెడల్స్‌తో ఘనంగా సత్కరించారు.

## ఏపీ జెఎసి తాలూకా యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక

**వింజమూరు, జూన్ 17, ప్రభాతవార్త :** ఏపీ జెఏసి వింజమూరు తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నిక చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏపీ జేఏసీ వింజమూరు తాలూకా యూనిట్ చైర్మన్‌గా వెలుగోటి మధు కార్యదర్శిగా కే.



రామారావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ వెలుగోటి మధు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ కమిటీలో అన్ని సంఘాల నుండి మొత్తం 17 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా అడుగులు వేస్తామని తెలిపారు అనంతరం కమిటీ వివరాలు తెలిపారు కమిటీ ఉప చైర్మన్లుగా జి చంచల బాబు యాదవ్, బి సుధాకర్ రావు, వి శివ కోట రెడ్డిలు సంయుక్త కార్యదర్శి ఏ మల్లికార్జున, ఏ వివేక, ఆర్ సురేష్‌లు కోశాధికారిగా పి నరసయ్య, ఈసీ సభ్యులుగా ఎల్ శ్రీనివాసులు, జి కాంతారావు, బి మధు, ఎస్కే అబ్దుల్ బాషా, పి నికిత, డి అజయ్ కుమార్, బి రామిరెడ్డి, ఎస్ శ్రీనివాసులు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ బండారుపల్లి వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రెటరీ ఏ సురేందర్ రెడ్డి, కోచైర్మన్ పి కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి రామకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎన్ ఆంజనేయ వర్మ తదితరులు హాజరయ్యారు.

## చేజర్లలో ఓటర్ల వెర్ఫికేషన్ కార్యక్రమం

**చేజర్ల, జూన్ 17, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా చేజర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని 264, 265 బూత్‌లలో బుధవారం ఓటర్ల వెర్ఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తలు పాల్గొని ఓటరు జాబితాలో నమోదైన వివరాలను



పరిశీలించారు. ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో ధృవీకరిస్తూ ఇంటింటికి వెళ్లి పరిశీలనలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో చేజర్ల మండల సొసైటీ అధ్యక్షుడు బూదల్ల వీరరాఘవరెడ్డి, టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు సోమవరపు హజరత్తయ్య, బూత్ కన్వీనర్లు అరవ దామోదర్ రెడ్డి, ఆత్మకూరు పెంచలయ్య తదితరులు బీఎల్ఓలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, వివరాల సవరణలు, చిరునామా మార్పులు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమీషన్ చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా ఖచ్చితంగా రూపొందించడమే ఈ వెర్ఫికేషన్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పల్లెగడపలో కాసులు గలగల

**కోట, జూన్ 17 ప్రభాతవార్త :** గ్రామ పంచాయతీలకు కేంద్రం నిధుల వరద పారించింది. 16వ ఆర్థిక సంఘం ద్వారా రానున్న ఐదేళ్ల కాలానికి భారీగా నిధులను కేటాయించింది. పంచాయతీ ఎన్నికల అనంతరం దశల వారీగా ఇవి జమ కానున్నాయి. గ్రామాల అభివృద్ధికి పంచాయతీలు వివిధ రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్నా స్థానిక అవసరాలకే చాలడం లేదు. ఈ సమస్యకు పరిష్కారంగా కేంద్రప్రభుత్వం ఆర్థిక సంఘం పేరిట నిధులను గత కొన్నేళ్లుగా విడుదల చేస్తోంది. ప్రతి ఐదేళ్లకోసారి బడ్జెట్‌ను ప్రకటిస్తుంది. ఈ ఏడాది మార్చితో 15వ ఆర్థిక సంఘం నిధుల ప్రక్రియ ముగిసింది. రానున్న ఐదేళ్లకు సంబంధించి 16వ ఆర్థిక సంఘం కింద నిధులు రానున్నాయి. కేంద్రం కేటాయించిన నిధులను ఐదేళ్లకు సర్దుబాటు చేస్తుంది. ఇది పంచాయతీలు (70శాతం), మండల పరిషత్ (20 శాతం), జిల్లా పరిషత్ (10శాతం) చొప్పున చేరుతాయి. జిల్లాకు సంబంధించి గత ఐదేళ్లలో ఏడాదికి సుమారు 150 కోట్ల వరకు వచ్చాయి. గత ప్రభుత్వ పాలనలో పంచాయతీల అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. ఆర్థిక సంఘం నిధులను మళ్లించడంతో సర్పంచులు గ్రామాలను అభివృద్ధి చేయలేక ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్థిక సంఘం నిధులు పక్కాగా చేరేలా చర్యలు చేపట్టింది. ఆర్థిక సంఘం నిధుల్లో జిల్లాకు కేటాయింపులు గణనీయంగా పెరిగాయి. పంచాయతీలకు నూతన పాలకవర్గాలు వచ్చిన తర్వాత ఈ నిధులు సద్వినియోగం చేస్తే పల్లెలు ప్రగతి బాటలో పయనిస్తాయి. వారికి మంచి పేరొస్తుంది.

## ప్రైవేటు పాఠశాలలు ఫీజుల వివరాలను బహిర్గతం చేయాలి

**- ఎంఇఓ-1 శిరీష**

**కోట, జూన్ 17 ప్రభాతవార్త :** కోట మండలంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల వద్ద వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను నోటీసు బోర్డులో ప్రదర్శించాలని ఎంఇఓ-1 శిరీష కోరారు. బుధవారం స్థానిక ఎంఇఓ కార్యాలయంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా



ఆమె మాట్లాడుతూ ఏ తరగతికి ఎంత ఫీజు వసూలు చేస్తున్నారన్న విషయాన్ని నోటీసు బోర్డులో స్పష్టంగా చూపాలన్నారు. అలా నోటీసు బోర్డుల్లో ఫీజుల వివరాలు ప్రదర్శించకపోతే ఆటువంటి పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## అల్లూరు నూతన తహశీల్దార్‌గా నవీన్‌కుమార్

**అల్లూరు, జూన్ 17 ప్రభాతవార్త :** అల్లూరు నూతన తహశీల్దార్‌గా ఏ నవీన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సెక్రటేరియట్ నుంచి అల్లూరు నూతన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన నవీన్‌కుమార్‌కు డిప్యూటి తహశీల్దార్ ప్రవీన్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికారు. గతంలో తహశీల్దార్‌గా పేనిచేసిన ఏ.లక్ష్మినారాయణ, మార్కాపురం జిల్లా పామూరు తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.



## బీదా మస్తాన్ రావుని విమర్శిస్తే సహించేది లేదు

**బిట్రగుంట జూన్ 17 ప్రభాతవార్త :** రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్ రావు నువిమర్శిస్తే సహించేది లేదని బిఎంఆర్ యువసేన అధ్యక్షుడు షమీవుల్లా హెచ్చరించారు. బోగోలులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీదా మస్తాన్‌రావుకి ఇటీవలే డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగిందనిఅయితే ఇటీవల కొంతమంది బీదా మస్తాన్ రావు ఏమి సమాజ సేవ చేశారని ఆయనకు డాక్టర్ రేట్ ఎందుకు ఇచ్చారు అని కొంతమంది వాళ్ళ ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆయన సేవలు మీకేం తెలుసని మాట్లాడుతున్నారని, ఆయన గత 30 సంవత్సరాల ముందు నుంచి బిఎంఆర్ చారి ట్రబుల్ ట్రస్ట్ స్థాపించి ట్రస్టు ద్వారా ఎన్నో సేవ కార్యక్రమాలు చేశారని, కొన్ని వేల మెడికల్ క్యాంపులు పెట్టి ఉచిత కంటి శిబిరాలు నిర్వహించి కొన్ని వేల మంది జీవితాల్లో కంటి వెలుగు నింపిన మహానుభావుడుఅనికొనియాడారు. కావలి నియోజకవర్గం లో ఎంతోమంది విద్యార్థి విద్యార్థులకు ట్రస్టు ద్వారా స్కూల్ ఫీజు గాని కాలేజీ ఫీజు గాని ఎంతో వేల మందికి సొంత నిధులతో సాయం చేసిన పెద్దమనసు ఆయనదని అంతేకాకుండా ఆయన గత 20 సంవత్సరాల నుంచి ముస్లిమ్స్ పిల్లలకు కావలి నియోజకవర్గం లో ట్రస్టు ద్వారా ఉచితంగా ఒడుగులు చేపిస్తున్నారని పేర్కొన్నారు ఇసుకపల్లిలో సొంతగృహం లేని వాళ్లకు ఆయన సొంత నిధులతో కోట్లాది కోట్లు పెట్టి వారికి సొంతంగా స్థలం సమకూర్చిన మహోత్సమైన వ్యక్తి అని,ఆయన నియోజకవర్గం లో గత 20 సంవత్సరాల నుంచి ప్రభుత్వ కాలనీలు ఎవరు కట్టుకున్న బేస్ మట్టానికి 15 వేల రూపాయలు లెక్కన ఇచ్చిన ఏకైక నాయకుడని అన్నారు. ఇంకా నియోజకవర్గం లో ఎన్నో వాటర్ ప్లాంట్లు నిర్మించిన వ్యక్తి ఆయన అంతేకాకుండా గత 30 సంవత్సరాల నుంచి ట్రస్టు ద్వారా ఎన్నో వేల మంది క్రీడాకారులకు శిక్షణ ఇప్పించి ప్రతిసంవత్సరం ట్రస్టు ద్వారా వాళ్లకి క్రీడా దుస్తులు కిట్టు సమకూర్చిన వ్యక్తి. ఆయన శిక్షణలో శిక్షణ పొందిన యువకులకు చాలామందికి ఉద్యోగాలు కూడా వచ్చినాయని అన్నారు. ఇంకా గుడికి మసీదుకి చర్చిలకు ఆయన సొంత నిధులతో కోట్ల రూపాయలు ఇచ్చిన వ్యక్తి ఆయన ఎవరైనా సరే ఆయన దగ్గరికి వెళ్లి శుభకార్యం జరిగిన ఆ శుభకార్యం జరిగిన ఆయన ఎంతో పెద్ద మనసుతో కొన్ని వేల మందికి ఆయన సొంత నిధులతో సహాయ సహకారాలు చేసిన వ్యక్తి అని అన్ని విధాల డాక్టరేట్ అర్హుడు అన్నారు ఆయన గురించి ఎవరైనా విమర్శలు చేస్తే బిఎంఆర్ అభిమానులం గా మేము సహించమని హెచ్చరించారు.



## ముత్యాలమ్మ ఆలయంలో వేలం పాటలు

**చిల్లకూరు, జూన్ 17, ప్రభాతవార్త :** మండల పరిధిలోని తూర్పు కనుమూరు గ్రామంలో వెలసిన శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం సంవత్సరం పాటు ప్రసాదాలు విక్రయించేందుకు వేలంపాటి నిర్వహించగా ఎనిమిది లక్షల 70 వేలు అదేవి ధంగా ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో భక్తులు సమర్పించిన చీరలు సేకరించి విక్రయించేదుకు వేలం పాట నిర్వహించగా 18 లక్షల రూపాయలకే పాడుకోవడం జరిగింది. అదే



విధంగా పోలేరమ్మ ఆలయం వద్ద కూడా చీరలు విక్రయించేందుకు ఏడు లక్షల 5 వేలు రూపాయలు పాడుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో కె నవీన్ కుమార్, కమిటీ సభ్యులు అన్న మునిశేఖర్, నాయకులు పోక్కల బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాప్ పొలంబడి ఐఎన్‌డి గ్యాప్ సర్టిఫికేషన్‌పై నెల్లూరులో ప్రాంతీయ స్థాయి శిక్షణా కార్యక్రమం

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి**

**నెల్లూరు, జూన్ 17, ప్రభాతావార్త - అగ్రికల్చర్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్-2026 సీజన్‌ను పురస్కరి ంచుకుని గ్యాప్ పొలంబడి ఐఎన్‌డి గ్యాప్ సర్టిఫికేషన్ అంశాలపై బుధవారం నెల్లూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలో జిల్లా స్థాయి ఒకరోజు అవగాహన శిక్షణా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా వ్యవసాయ అధికారి పి. సత్యవాణి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఆర్గానిక్ ప్రొడక్ట్ సర్టిఫికేషన్ ఏజెన్సీ క్వాలిటీ మేనేజర్, డా.యుగంధర్, కమీషనరేట్ పొలంబడి ఏడిఏ వెంకటేశ్వర్లు, ఆత్మ డీపీఎం ఉషారాణి విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ ప్రాంతీయ శిక్షణ కార్యక్రమానికి నెల్లూరు, తిరుపతి, ప్రకాశం మరియు మార్కాపురం జిల్లాల పరిధిలోని సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, సాంకేతిక వ్యవసాయ అధికారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం కమిషనర్ పొలంబడి ఏడిఏ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా సాగులో అమలవుతున్న లోపభూయిష్ట యాజమాన్య పద్ధతుల కారణంగానే నేడు ఐఎన్‌డి గ్యాప్ సర్టిఫికేషన్ అవసరం ఏర్పడిందని తెలిపారు. రైతులు పంటలపై మితిమీరిన స్థాయిలో పురుగుమందులు వినియోగించడం, అవగాహన లేకుండా అనేక రసాయనాలను కలిపి పిచికారీ చేయడం వల్ల పంటల్లో రసాయన అవశేషాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. దీని ప్రభావంగా అంతర్జాతీయ మార్కెట్‌లో భారతీయ వ్యవసాయ ఉత్పత్తుల పోటీతత్వం తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులను అధిగమించడానికి పొలంబడి ఒక సమర్థవంతమైన వేదికగా పనిచేస్తుందని తెలిపారు. 14 వారాల పాటు నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా రైతులు తమ పొలాల్లో స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనలు నిర్వహించి, పురుగుల తీవ్రతను అంచనా వేసి, అవసరమైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవచ్చని చెప్పారు. అలాగే, పొలంబడి ప్రధాన లక్ష్యం రసాయనాల వినియోగాన్ని తగ్గించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతో పాటు, పంటలకు హాని చేసే శత్రు పురుగులను నియంత్రించే మిత్రపురుగులను సంరక్షించడం ద్వారా సహజసిద్ధమైన వ్యవసాయ విధానాలను ప్రోత్సహించడమేనని వివరించారు .ఈ సందర్భంగా ఏపిఎస్ఓపిసిఏ క్వాలిటీ మేనేజర్ డాక్టర్ యుగంధర్ ఐఎన్‌డి గ్యాప్ ఆర్గానిక్ సర్టిఫికేషన్ ప్రాసెస్ గురించి వాటి ప్రమాణాల ప్రాధాన్యతను వివరించారు. ఉత్పత్తుల నాణ్యత, ట్రేసబిలిటీ మరియు ధృవీకరణ ప్రక్రియలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఆత్మ డీపీఎం ఉషారాణి మాట్లాడుతూ రైతులకు క్షేత్రస్థాయిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడంలో ఆత్మ సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.




## రెండు బైకులు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

**నెల్లూరు క్రైమ్, జూన్ 17, ప్రభాతవార్త:** ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్ళు ఢీకొన్న సంఘటనలో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నెల్లూరు రూరల్ పోలీసులు కథనం మేరకు నెల్లూరు నగరానికి చెందిన సురేష్ రూరల్ మండలం సోత్ములుర్పార్ గ్రామంలోని ఓ బ్యాంకులో గోల్డ్ అప్రైజర్‌గా పని చేస్తుంటారు. మంగళవారం పొద్దుపోయిన తర్వాత విధులు ముగించుకుని నెల్లూరుకు వస్తున్న క్రమంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో సురేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడు నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.



## బిరదవోలులో ఖేత్ బచావో అభయాన్ కార్యక్రమం

**పొదలకూరు, జూన్ 17, ప్రభాతవార్త :** మండలం పరిధిలోని బిరదవోలు గ్రామంలో వ్యవసాయ పరిశోధనా స్థానం పొదలకూరు వారి ఆధ్వర్యంలో, వ్యవసాయ శాఖ సహకారంతో ఖేత్ బచావో అభయాన్ (నేల ఆరోగ్యాన్ని కాపాడుకుందాం భవిష్యత్తును సంరక్షించుకుందాం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ శాఖ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, రైతులు, రైతు సోదరీమణులు పాలొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధనా స్థానం, పొదలకూరు శాస్త్రవేత్త డా. ఎం.సి ఓబయ్య మాట్లాడుతూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో మట్టి నమూనా పరీక్ష యొక్క ప్రాముఖ్యత మరియు మట్టి పరీక్ష ఆధారిత ఎరువుల వాడకం గురించి వివరించారు. పచ్చి రొట్టె ఎరువులు, జీవన ఎరువుల ప్రాముఖ్యత, వివిధ పంటలలో వాటి ఉపయోగం గురించి కూడా తెలియజేయడం జరిగినది.అదేవిదంగా నిమ్మ రైతులు ఎక్కువగా పాల్గొనడం వలన నిమ్మ పంటలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు గురించి డా.హసీనా బాను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి బి. రాజ మోహన్ రెడ్డి, విఎఎ మౌనిక, రైతులు,వెన్నపూస రమణా రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, ఎత్తపు వెంకటరెడ్డి, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



## పనులు మరింత వేగవంతం కావాలి

**కోవూరు, జూన్ 17 ప్రభాతవార్త :** కోవూరులోని బీసీ బాలికల వసతి గృహంలో జరుగుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేపట్టే ప్రతి పని ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో పాటు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రస్తుతం సాగుతున్న పనులు గడువులోగా పూర్తి చేసేలా పనులు పొందిన కాంట్రాక్టర్ తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ పరిశీలనలో ఏఈ జగదీష్ ఉన్నారు.




**శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానము**

కలవకొండ గ్రామం, చిల్లకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

ప్రకటన నెం. 04/2026 తేది: 15.06.2026

**మెట్ట భూములు-సిలికా స్టాకు యార్డు క్రింద గాని / మెట్ట పంటలుకు గాని లైసెన్సు కొరకు సీల్డు టెండరు /బహిరంగ వేలం ప్రకటన**

ఇందు మూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై దేవస్థానమునకు హక్కు అనుభవము కలిగియున్న ఈ క్రింది షెడ్యూల్ దాఖల మెట్ట భూములను తేది 01-09-2026 నుండి 31-08-2031 వరకు అనగా '5' సంవత్సరాల కాలపరిమితికి లీజుకు ఇచ్చుటకు సీల్డ్ టెండర్లు మరియు బహిరంగ వేలంపాట పై దేవస్థానము వద్ద తేది 26-06-2026 న ఉదయం 10:30 ని॥లకు జరుగును, టెండర్ షెడ్యూల్ కొరకు రూ.200/-లు చెల్లించి ప్రకటన తేది నుండి తేది 25-06-2026 సాయంత్రం 5-00 గం॥ వరకు పై దేవస్థాన కార్యాలయము నందు పొందవచ్చును. ధరావత్తుతో పాటు టెండరు షెడ్యూలు తేది 26-06-2026న ఉదయం 10-00 గం॥లోపు టెండరు బాక్స్ నందు వేయవలెను అదే రోజు వేలంపాట పూర్తి అయిన తుదుపరి టెండరు బాక్స్ దేవదాయ శాఖ అధికారుల మరియు హాజరైన టెండరుదారులు సమక్షములో తెరవబడును. ఈ క్రింది లైసెన్సు హక్కులకు పాట తెగిన వెంటనే ధరవత్తుతో కలుపుకొని 1 సం॥ హెచ్చుపాట మొత్తం వెంటనే చెల్లించవలెను. తదుపరి ఆమోదము కొరకు ఉన్నతాధికారులకు పంపబడును.

1. భూముల వివరములు :

| ప్లాట్ నెం. | సర్వే నెం. | విస్తీర్ణం | కాల పరిమితి | ధరావత్తు | |
|---|---|---|---|---|---|
| | | | | సిలికా యార్డు | మెట్ట పంటలు |
| 1 | 92/3 | 25-00 | తేది. 01.09.2026 | రూ.2,00,000/- | రూ.1,00,000/- |
| | 92/3 | 25-00 | నుండి 31.08.2031 | రూ.2,00,000/- | రూ.1,00,000/- |
| | 92/3 | 2-17 | వరకు అనగా | రూ.1,00,000/- | రూ.50,000/- |
| | 92/3 | 5-15 | 5 సంవత్సరాలు | రూ.1,00,000/- | రూ.50,000/- |

పై టెండరు షరతుల కొరకు టెండరు సమయములో కాని ముందుగా గాని పై దేవస్థానము నందు తెలుసుకొనవచ్చును. వివరములకొరకు నెం. 7981294396 ను సంప్రదించగలరు.

చైర్మన్ మరియు ధర్మకర్తల మండలి సభ్యులు — కార్యనిర్వాహణాధికారి


## ప్రతి ఓటు నమోదు లక్ష్యంగా ఇంటింటి పరిశీలన

**కొడవలూరు, జూన్ 17 ప్రభాతవార్త:** సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా కొడవలూరు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించి నమోదు చేస్తున్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆదేశాల మేరకు ఈ నెల 15 నుంచి జులై 14 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో బీఎల్వోలు, బీఎల్ఏలతో పాటు టీడీపీ నాయకులు పాల్గొంటూ ప్రతి ఓటు నమోదు లక్ష్యంగా ఇంటింటి సర్వే చేపడుతున్నారు.- ఈ సందర్భంగా నీటి సంఘం డైరెక్టర్ నక్క రమణయ్య, ఐటీడీపీ మండల అధ్యక్షుడు కోవూరు వెంకీ, మైనార్టీ నాయకుడు ఎస్కే నవాజ్, బూత్ కోకన్వీనర్ దాసరి పవన్కుమార్, ముడి శ్రీకాంత్, కోవూరు సుజి, కోవూరు అఖిల్ తదితరులు బీఎల్వోలతో కలిసి ఓటర్ల వివరాల పరిశీలనలో పాల్గొన్నారు.



## దళిత మహిళపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

**తోటపల్లి గూడూరు, జూన్ 17, ప్రభాతవార్త** మండలంలోని ఈదూరు మిట్టపాలెం గ్రామానికి చెందిన దళిత మహిళ ఇనకళ్ళ వైశాలిపై కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కెవిపిఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. దాడిలో గాయపడిన వైశాలి ప్రస్తుతం నెల్లూరులోని జీజీహెచ్‌లో చికిత్స పొందుతుండగా, ఆమెను కెవిపిఎస్ జిల్లా నాయకులు పరామర్శించారు.ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి రఘురామయ్య, జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు వైశాలిని కులం పేరుతో దూషించి మూకుమ్మడిగా దాడి చేశారని ఆరోపించారు. దళిత మహిళపై జరిగిన ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని వెంటనే అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు.



## ఓటు హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

**- ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ**

**కొడవలూరు, జూన్ 17 ప్రభాతవార్త:** ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెంలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సర్వేపల్లి నియోజకవర్గ పరిశీలకులు వీరి చలపతిరావు కుటుంబ సభ్యులకు సంబంధిత బూత్ స్థాయి అధికారి (బీఎల్వో), బూత్ స్థాయి ఏజెంట్ (బీఎల్ఏ)లు ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా వీరి చలపతిరావు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదై ఉండేలా చూడటం ప్రజాస్వామ్య పరిరక్షణలో కీలకమని అన్నారు. ఎవరి ఓటు హక్కు కోల్పోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియపై పార్టీ శ్రేణులు, బీఎల్ఏలు, ప్రజలు పూర్తి అవగాహనతో వ్యవహరించి, ఓటరు హక్కుల పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు.



## ఓటర్ల తొలగింపుపై అప్రమత్తంగా ఉండాలి రామతీర్థంలో వైకాపా బీఎల్ఏలతో సమీక్ష

**విడవలూరు,జూన్ 17 ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అప్రమత్తంగా వ్యవహరించాలని వైకాపా మండల అధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్ రెడ్డి సూచించారు. మండలంలోని రామతీర్థంలో దాసరి కరుణాకర్ నివాసంలో బుధవారం పార్టీ నాయకులు, బీఎల్ఏలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఓటు విలువైనదే ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలకమని, ఓటర్ల జాబితా పరిశీలనలో బీఎల్ఏల పాత్ర ముఖ్యమని పేర్కొన్నారు. బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో జాబితాను నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఏవైనా పేర్లు తొలగింపునకు గురవుతున్నాయన్న అనుమానం ఉంటే వెంటనే గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని చెప్పారు. పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులు తమ ఓటు హక్కు కోల్పోకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు. పాల్గొన్న నాయకులు సమావేశంలో పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, అనపల్లి ఉదయభాస్కర్, దాసరి వెంకటేశ్వర్లు, నెల్లూరు చెంచురత్నం, బుచ్చింగారి తిరుపతి, రామచంద్రపురం మాజీ సర్పంచ్ సీనయ్య, గుబ్బ రాదయ్య, కాగోలు చిన్నమస్తానయ్య, బద్దిపూడి వెంకటరావు, భాష తదితరులు పాల్గొన్నారు.



## వృద్ధులు, వికలాంగులకు ముందస్తుగా రేషన్

**కొడవలూరు, జూన్ 17 ప్రభాత వార్త:** మండలంలోని రేషన్ డీలర్లు ప్రభుత్వం సరఫరా చేసే సరుకులను ఎలాంటి జాప్యం లేకుండా లబ్ధిదారులకు సకాలంలో అందించాలని తహశీల్దార్ కె. స్ఫూర్తి రెడ్డి తెలిపారు. రేషన్ పంపిణీ విషయంలో డీలర్లు తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలను ఆమె వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వికలాంగులు, వృద్ధులకు మిగిలిన లబ్ధిదారుల కంటే ఐదు రోజుల ముందుగానే రేషన్ సరుకులను అందజేయాలని సూచించారు. ఇతర కార్డుదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోనే పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని పేర్కొన్నారు. రేషన్ పంపిణీలో నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, లబ్ధిదారులకు సరుకులు సకాలంలో అందేలా డీలర్లు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.

## రేషన్ పంపిణీ సకాలంలో పూర్తి కావాలి



**కోవూరు, జూన్ 17ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని అన్ని గ్రామాల్లో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సకాలంలో పూర్తి చేసేలా డీలర్లు తగు చొరవ తీసుకోవాలని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని అన్ని గ్రామాల డీలర్లతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలర్ వారి వారి పరిధిలో ఉన్న 65 సంవత్సరాలకు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ అందించాలన్నారు. ప్రతి రేషన్ షాపు ఎదుట సరుకుల సమాచారాన్ని కార్డుదారులకు తెలిసేలా డిస్‌ప్లే ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వేళలు పాటిస్తూ సకాలంలో కార్డుదారులకు సరుకులు అందించాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, తదితరులు ఉన్నారు.

## ప్రశాంతమ్మ!! అభివృద్దిని చూసి మాట్లాడమ్మ!! మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి




**బుచ్చి జూన్ 17 ప్రభాతవార్త :** మాటకొస్తే తట్టమట్టి వేశారా!! తట్టమట్టి వేశారా!! అంటు మాట్లాడే ఎమ్మెల్యే ప్రశాంతమ్మ పెనుబల్లి గ్రామంలో జరిగిన అభివృద్ధి చూసి మాట్లాడాలని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విమర్శించారు. బుధవారం జరిగిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతు పెనుబల్లి గ్రామంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిఅభివృద్ధి జరగలేదని విమర్శించింది . గ్రామంలో 6 కోట్ల రూపాయాలతో జరిగిన అభివృద్దిని పోటోలతో సహచూపిస్తున్నామని ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. సచివాలయ భవనం కట్టింగి వైసిపి హయాంలో! రైతు భరోసా కేంద్రం కట్టింది వైసిపి హయాంలో! విలేజి హెల్త్ సెంటర్ కట్టింది వైసిపి హయాంలో!. నాడు నేడు పధకం కింద స్కూల్స్ అభివృద్ధి చేసింది వైసిపి హయాంలో. 2 కోట్ల రూపాయాలతో జొన్నవాడ నుండి బుచ్చిరెడ్డిపాళెం రోడ్డు వేసింది వైసిపి హయాంలో,కాగులపాడు రోడ్డు వేసింది వైసిపి హయాంలో చెప్పారు. ఈ అభివృద్ధి పనులన్ని జరిగింది లేనిది ఒక్కసారి పరిశీలించాలని ఆయన సూచించారు. ఎంపి,ఎమ్మెల్యే వద్ద మెహర్బాణీకోసం ప్రశాంతమైన కోవూరు నియోజకవర్గంలో టిడిపి నేతలు కొంతమంది రౌడియిజం చేస్తున్నారు ఇది సరైన పద్దతి కాదని విమర్శించారు. దేవాలయాల్లో రౌడియిజం, ప్లెక్సిలు చింపడం, పోస్టులు పెట్టిన వారిపైన దాడి చేయడం ఇది మంచి సాంప్రదాయం కాదని అన్నారు. దామరమడుగు గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త సోషల్ మీడియాలో పోస్టు షేర్ చేసినందుకు ఆటో ఆపి దాడి చేశారు. ఇది మంచి పద్దతి కాదు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఏ నియోజకవర్గంలో నేను తిప్పినట్లు ఎవ్వరు తిప్పలేదు. ఎవ్వరైనా పార్టీలో తప్పు చేస్తే దండించాలి తప్ప వారిని ప్రోత్సహించ కూడాదు.గతంలో వైసిపి అధికారంలో ఉన్న సమయంలో పుట్టా సుబ్రమణ్యంనాయుడుపైన వైసిపి కార్యకర్త దాడి చేస్తే పార్టీ నుండి సస్పెండ్ చేసి ,సుబ్రమణ్యంనాయుడుకి క్షమాణచెప్పాను అని ఆయన గుర్తు చేశారు. కోవూరు నియోజకవర్గం ఎంతో ప్రశాంతంగా ఉంటుంది కేవలం ఎన్నికల సమయంలో మాత్రమే ఇక్కడ పార్టీలు తరువాత అందరు స్నేహంగా ఉంటారు. ప్రస్తుతం రౌడియిజం పెరిగి పోయింది. మేము రౌడియిజం చేయాలనుకుంటే చేయగలం అది మాసంస్కారం కాదు అని ఆయన హితవు పలికారు. ఈకార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ వీరిచలపతిరావు, సీనియర్‌నాయకులు గుల్లపల్లి విజయ్‌కుమార్ , టౌన్ అద్యక్షులు షేక్ షాహుల్, రూరల్ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, సీనియర్ నాయకులు అల్లాబక్ష ,మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ అల్లాబక్ష, చల్లాయపాళెం వెంకయ్య, బిట్రగుంట నారాయణ, అనూష్‌రెడ్డి, కౌన్సిలర్ యానాదిరెడ్డి, అడ్వికేట్ నరసింహారావు, రాజ్‌కుమార్, చింతం చలపతి, బట్టా విల్సన్, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి అమర్‌నాద్ మహిళలకు క్షమాపణ చెప్పాలి



**బుచ్చి జూన్ 17 ప్రభాతవార్త :** హోంమినిస్టర్‌ని వ్యంగ్యంగా మాట్లాడిన మాజీ మంత్రి అమర్‌నాద్ క్షమాపణ చెప్పాలని టిడిపి మహిళా నాయకురాలు అందె ప్రత్యూషా, చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళి విమర్శించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.,ఈ సందర్బంగా అందే ప్రతూషా మాట్లాడుతు మహిళలను అవమానిస్తే ఉరుకోబోమని హెచ్చరించారు. గతంలో వైసిపి పార్టీలో ఉన్న సమయంలో అప్పటి ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నన్ను చాలా చిన్నచూపు చేశారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు మహిళలంటే చులకన భావన అని అన్నారు.మా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మమ్మల్ని ఎంతో గౌరవంగా చూస్తున్నారని , నియోజకవర్గాన్ని అభివృద్ది పధంలో నడిపిస్తున్నారని అన్నారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ పఠాన్ నస్రీన్, మైనార్టీనాయకురాలు ఫర్వీనా, కౌన్సిలర్ తాళ్ళ వైష్ణవి, కౌన్సిలర్ శ్రీదేవి మాట్లాడుతు మహిళలను వ్యక్తిగతంగా అసభ్య పదజాలంతో మాట్లాడడం సభ్యత కాదని అన్నారు. మంత్రి అనితను మేకప్ మంత్రి అని సంబోధించడం సరికాదని అన్నారు. చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ మాట్లాడుతు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి మాకు ఎలా చైర్‌పర్సన్ పదవి ఇచ్చారో అందరికి తెలుసు. మేము వైసిలో ఉన్న సమయంలో ఎటువంటి అభివృద్ది చేయలేకపోయాం. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి హయంలో మున్సిపాల్టీని అన్ని విధాలా అభివృద్ది చేసుకున్నాం. వైసిపి నాయకులు మహిళలను కించపరస్తు మాట్లాడడం సరికాదని వారు విమర్శించారు. ఈకార్యక్రమంలోటిడిపి నాయకులు కోదూరు కమలాకర్‌రెడ్డి, టిడిపి పార్లమెంట్ ఉపాధ్యాక్షులు మొగళ్లూరు వెంకటశేషయ్య, టౌన్ అధ్యక్షులు గుత్తా శ్రీనివాసులు, క్లష్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, మోర్ల మురళీ,వైస్ చైర్మన్ యరటపల్లి శివకుమార్‌రెడ్డి, దామరమడుగు నాయకులు శేషయ్య , మౌళి, మైనార్టీనాయకులు అక్తర్,రహమత్, పఠాన్ మహబూభాషా తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ్ రమణమ్మ సేవలు చిరస్మరణీయం



**కోట, జూన్ 17 ప్రభాతవార్త :** కేశవరం గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచ్ శ్రీరామ్ రమణమ్మ పంచాయతీ అభివృద్ధికి అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు పేర్కొన్నారు. బుధవారం కేశవరం పంచాయతీ రాఘవాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలకు అతీతంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి రమణమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రమణమ్మ తనయుడు గురుస్వామి మంచి నాయకుడని, అందరినీ అభిమానంగా చిరునవ్వుతో పలకరిస్తారని చెప్పారు. పదేళ్ల పాటు గురుస్వామి కుటుంబమే కేశవరం పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించారని పేర్కొన్నారు. ఎప్పుడు ఎవరు సర్పంచ్ ఇంటికి వెళ్లినా వారికి ఆమె అన్నంపెట్టేదని గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర ముదిరాజ్ సంఘం నాయకులు విచ్చేసి గురుస్వామిని పరామర్శించారు.

## ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే స్దాయి నీదికాదు జగదీష్



**బుచ్చి జూన్ 17 ప్రభాతవార్త :** ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఒక్కసారి ఎమ్మెల్యేగా జిల్లాలో ఒక ఉన్నతమైన నల్లపరెడ్డి కుటుంబానికి వారసుడు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని విమర్శించే స్దాయి నీదికాదు జగదీష్ అని వైసిపి నాయకులు టౌన్ అద్యక్షులు షేక్ షాహుల్,రూరల్ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి,దామరమడుగు మైనార్టీనాయకులు విమర్శించారు. బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దామరమడుగు బస్టాండ్‌లో జరిగిని విలేఖర్ల సమావేశంలో వారు మాట్లాడుతు ఒక్కసారి నీ చరిత్ర ఎందో తెలుసుకొని మాట్లాడు. ప్రశాంతిరెడ్డి మెప్పుకోసం నువ్వు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని దుర్భాషలాడుతావా! అన్ని రోజులు ఒకేలా ఉండవు. ప్రసన్నకుమార్‌రెడ్డి మీకుటుంబాన్ని గురించి ఎంతో గౌరవంగా మాట్లాడాడు.నీవు ఒక ఉన్నతమైన వ్యక్తిని పట్టుకొని ఇష్టాను సారం దుర్భాషలాడుతావా జాగ్రత్త. ఇవ్వన్ని నీ వెనుక ఉండి ఎవ్వరు చేయిస్తున్నారో మాకు తెలుసు.ఇది కోవూరు నియోజకవర్గం సమయం వచ్చినప్పుడు ప్రజలు సరైన తీర్పు ఇస్తారు జాగ్రత్తగా ఉండు అంటు టిడిపి రూరల్ అద్యక్షులు జగదీష్‌కి హితవు చెప్పారు. ఈకార్యక్రమంలో వైసిపినాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ర్యాంకింగ్ల కోసం ఉద్యోగులపై తీవ్రమైన ఒత్తిడి

**– సమయానికి జీతాలు తప్ప రావలసిన ఇతర ఆర్థిక ప్రయోజనాలు ఏమి మాకు రావడం లేదు**
**– ఉద్యోగులు పోరాటానికి సిద్ధంగా ఉండాలి – మేం బోనస్‌లు అడగడం లేదు....మాకు రావాల్సిన బకాయిల గురించి చెప్పమంటున్నాం – ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు**



**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త – కలెక్టరేట్ :** బుధవారం స్థానిక దర్గామిట్టలోని పినాకిని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ఉద్యమ కార్యాచరణ నిమిత్తం, నెల్లూరులో వివిధ శాఖాపరమైన సంఘాల జిల్లా, డివిజన్ స్థాయి నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారితో ఉద్యమ కార్యాచరణకు దారి తీసిన పరిస్థితిని వివరించి, ప్రతి ఉద్యోగి ఉమ్మడి సమైక్యతను చాటే విధంగా ఉద్యమ కార్యాచరణలో పాల్గొనాలని సూచించారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో ఉద్యోగులందరూ కార్యాచరణకు సిద్ధంగా ఉన్నారని, ఇక ఆలస్యం లేకుండా ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ఉద్యమ కార్యాచరణ వెంటనే మొదలు పెట్టాలని సూచించగా ఉద్యోగులందరు ఏకగ్రీవంగా ఆయన అభిప్రాయాన్ని బలపరిచారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సోషల్ మీడియాలో కొంత మంది పెయిడ్ ఆర్టిస్టులు మాట్లాడుతున్నట్లుగా ప్రభుత్వానికి ఉద్యోగులు భారం కాదని, ఉద్యోగులు ప్రభుత్వానికి వెన్నుముక లాంటి వారిని గుర్తించాలని, అలాంటి ఉద్యోగులకు ఉన్న గౌరవప్రదమైన జీవితాన్ని ఆర్థికపరంగా దిగజార్చవద్దని తెలియజేస్తూ, కేంద్ర ప్రభుత్వం, అనేక రాష్ట్రాల్లో ఉద్యోగులకు ఇస్తున్నట్లుగా మేము బోనస్‌లు అడగడం లేదని, గడువు దాటి మూడు సంవత్సరాలైనా కనీసం పిఆర్సి కమిషనర్ ని నియమించకపోవడాన్ని ఏ విదంగా చూడాలని, అధికారంలోకి రాగానే మంచి ఐ ఆర్‌ని ప్రకటిస్తామని కూటమి మేనిఫెస్టోలో పెట్టినప్పటికీ నేటికి ఆ ఊసే ఎత్తకపోవడాన్ని ఏ విధంగా చూడాలని, ప్రతి ఆరు మాసాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు, ధరలకు అనుగుణంగా పెంచే డిఏలు, ఈ ప్రభుత్వం వచ్చినప్పటి నుండి ఒక్క డిఏ కూడా విడుదల చేయకపోవడాన్ని ఏవిధంగా చూడాలని ప్రశ్నించారు. ఈ అంశాలపై ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా స్పందించకపోవడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో, ఉద్యోగుల ఆకాంక్ష మేరకు ఉద్యమ కార్యాచరణకు నిర్ణయం తీసుకున్నామని తెలియజేశారు. ఇప్పటికే జూన్ 10వ తేదీన 28 జిల్లాల్లో జిల్లా కార్యవర్గ సమావేశాలు, పత్రికా సమావేశాలు నిర్వహించుకుని, సాధారణ ఉద్యోగులను సమాయత్తం చేసుకుంటూ, కలిసొచ్చే సంఘాలను కలుస్తూ,ప్రభుత్వంలోని గౌరవ మంత్రులను కలుస్తూ, వివరిస్తూ ఉద్యమానికి సమాయత్తం చేస్తున్నామని,అందులో భాగంగానే ఈ రోజు నెల్లూరు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించుకుని జిల్లా, డివిజన్ స్థాయి నాయకులకు ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్న అంశాలను, ఉద్యమం ఎలా చేయాలో వారి నుండి సలహాలు స్వీకరించామని తెలిపారు. ఒక ప్రక్క సమయపాలన లేకుండా ర్యాంకుల కోసం అనేక శాఖలలో ఏకకాలంలో అనేక పనులు అప్పగించి తీవ్రమైన పని వత్తిడి తెస్తున్నారని, ఇంకొక ప్రక్క అనూహ్యంగా పెరుగుతున్న మార్కెట్ ధరలు, బరువెక్కుతున్న నిలీ। లతో ఉద్యోగుల కుటుంబాలు ఎలా నెట్టుకురావాలని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల స్థానంలో గత పదిహేను సంవత్సరాలుగా రెండు లక్షల మంది ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్న ఈ ప్రభుత్వంలో, రాష్ట్ర ఆదాయంలో 90 శాతం పైన ఉద్యోగులు ఖర్చులకే సరిపోతున్నాయని చెప్తూ, ప్రజల దృష్టిని ప్రభుత్వం మళ్లించటం దురదృష్టం అని తెలుపుతూ, ఉద్యోగులకు, పెన్షనర్లకు ప్రభుత్వం పెట్టే ఖర్చు పై మాకు స్పష్టమైన అవగాహన ఉందని సందర్భం వచ్చినప్పుడు ప్రజలకు, ఉద్యోగులకు అన్నీ వాస్తవాలు వెల్లడిస్తామని తెలియజేశారు.

**ఉద్యమ కార్యాచరణ కమిటీ చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు మాట్లాడుతూ** పి ఆర్ సి అమలు సమయం దాటి ఇప్పటికే మూడు సంవత్సరాలు అయ్యిందని, కూటమి ప్రభుత్వం మేనిఫెస్టో లో ప్రకటించిన విధంగా కనీసం మధ్యంతర భృతి (ఐ) కూడా విడుదల చేయలేదని, ఈ ప్రభుత్వ హయాంలో విడుదల కావాల్సిన డి.ఏలు ఒక్కటి కూడా విడుదల కాలేదని, ఈ ప్రభుత్వాన్ని నమ్మిన ఉద్యోగులకు కనీసం బకాయిల గురించి గానీ, ఆర్థిక అంశాలపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేకపోవడం దురదృష్టమని, ప్రభుత్వం ఉద్యోగుల అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యతను విస్మరించిందని, కానీ ఏపీ జేఏసీ అమరావతి.ఉద్యోగుల ప్రయోజనాల కోసం తన బాధ్యతను విస్మరించకుండా..ఉద్యమ కార్యాచరణని ప్రకటించేందుకు.సమాయత్తం అవుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ అల్లంపాటి పెంచల రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు జిల్లా ఉద్యమాలకు పురిటి గడ్డ అని, ఉద్యోగుల న్యాయమైన కోర్కెల సాధనకు ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం ఇచ్చే పిలుపును తూ.చ తప్పకుండా విజయవంతం చేస్తామని ప్రకటించారు .ఈ సమావేశంలో జనరల్ సెక్రటరీ ఓ .వి.ప్రసాద్ ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర వైస్ చైర్మన్ మరియు ఆర్ డబ్ల్యు ఎస్ ఇంజనీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల కుమార్ రెడ్డి ,మరో వైస్ చైర్మన్ చంద్రశేఖర్, జిల్లా మహిళా చైర్మన్ శ్రీమతి వసంతకుమారి,మహిళా సెక్రటరీ శ్రీమతి చెన్నమ్మ జిల్లా కార్యవర్గ సభ్యులు థామస్,చెంచు రామయ్య, బి.మురళి, మాల్యాద్రి, రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు డానియల్ పీటర్ రావు,గోపి కృష్ణ, శ్రీమతి బాలకోటమ్మ, వెంకట్ ,కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల సంఘం నాయకులు మరియు ఏపీ జేఏసీఅమరావతి అనుబంధ శాఖల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న స్టాల్స్




**కోవూరు, జూన్ 17ప్రభాతవార్త :** కోవూరులోని తాలూకా కార్యాలయ ప్రాంగణంలో బుధవారం కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండు సంవత్సరాలు పూనర్తయిన సందర్భంగా ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ, వ్యవసాయ శాఖ, , మండల పరిషత్, ఐసీడీఎస్ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానంగా రెవెన్యూ శాఖకు సంబంధించిన కలెక్టర్ రూపొందించిన వన్ మంత్, వన్ విజేల్ ఫోర్ విజిట్‌కు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. అదేవిధంగా నూతనంగా ముద్రించిన రైతుల పాస్ పుస్తకాలు కూడా ఏర్పాటు చేశారు. మండల విద్యాశాఖకు సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్లు, ఏయే వస్తువులు పంపిణీ చేస్తారో వాటిని కూడా డిస్‌ప్లేలో ఏర్పాటు చేశారు. మండల పరిషత్‌కు సంబంధించి పింఛన్ల పంపిణీపై ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాఖకు సంబంధించి రైతులకు అందిస్తున్న రైతు భరోసా , తదితర వాటిని ఏర్పాటు చేశారు. ఐసీడీఎస్ శాఖకు సంబంధించి తమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పౌష్టికాహారం, అంగన్‌వాడీ పిలుస్తోంది, తదితర కార్యక్రమాలకు సంబంధించిన డిస్‌ప్లే బోర్డును ఏర్పాటు చేశారు. వీటిని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి,ో వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ జిలాపార్టీ అధ్యక్షుడుఎమ్మెల్సీ బీద రవిచంద్ర, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లురెడ్డి కోదూరు కమలాకర్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ వీరేంద్రనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, ఏకోల్లు పవన్‌రెడ్డి, జగదీష్, నాపా వెంకటేశ్వర్లు నాయుడుతో పాటు పార్టీ సీనియర్ నాయకులు జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, , పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, జెట్టి మదన్‌రెడ్డి,వెంకటరమణమ్మ, ఆవుల వాసు, కోవూరు నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి విజయారెడ్డి, సాయిరెడ్డి,సాయిజయంత్‌రెడ్డి, సీసీఎస్ క్యాటరింగ్ అధినేత చంద్రశేఖర్, మల్లికార్జునరెడ్డి, బాల రవి, వై. రమణారెడ్డి, మదన్‌రెడ్డి, ఎన్. వెంకట్, సుధాకర్, సుబ్బానాయుడు,సుధాకర్, సీహెచ్ పెంచలయ్య, చంద్రశేఖర్, ఐదు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు కూటమి నాయకులు సుబ్బారావు, అల్తాఫ్,, పెద్ద సంఖ్యలో నేతలు కార్యకర్తలు ఉన్నారు.

## మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పందిటి కామరాజు



**కావలి, జూన్ 17 ప్రభాతవార్త :**తాడేపల్లిలో వైఎస్ఆర్ సిపి కేంద్ర కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మో హన్‌రెడ్డిని వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎస్‌సి విభాగం సుధాకర్‌బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారా వుల ఆధ్వర్యంలో ఉమ్మడి నెల్లూరుజిల్లా కందు కూరు నియోజకవర్గ ఎస్‌సిసెల్ అధ్యక్షులు పందిటి కామరాజు బుధవారం మర్యాదపూ ర్వకంగా కలవడం జరిగింది. ఈ సంద ర్భంగా పలు సమస్యల మీద చర్చించడం జరిగింది. జిల్లాలో పలు సమస్యలపై చురకుగా కార్యక్రమాల్లో ఉంటున్నందున కామరాఉను జగన్‌మోహన్‌రెడ్డి అభినందించడం జరిగింది. అనంతరం కామరాజు మాట్లాడుతూ జిల్లా అధ్యక్షులు కాకాని గోవర్ధన్‌రెడ్డి, కావలి ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జిల్లాలోని నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌ల సహాయం, సహకారాలతో పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్ళడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో సుధాకర్‌బాబు, కనకారావుల ఆధ్వర్యంలో ఎన్నో కార్యక్రాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకొని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే వరకు పోరాటాలు ఆగవని తెలిపారు. జిల్లాలో దళితులపై అన్యాయం జరిగినా వైకాపా తరపున పోరాటం చేస్తామని తెలిపారు.

## ప్రసన్న నీ అంతు చూస్తా! రూరల్ అధ్యక్షులు బెజవాడ జగదీష్ తీవ్ర దుర్భాషలు



**బుచ్చి జూన్ 17 ప్రభాతవార్త :** ప్రసన్న నీ అంతు చూస్తా... అంటు మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని టిడిపి రూరల్ అద్యక్షులు బెజవాడ జగదీష్ తీవ్ర అసభ్య పధజాలంతో దూషించారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై విమర్శలు చేసే అర్హత నీకు లేదు అంటు తీవ్రంగా దుయ్య బట్టారు. సోమిరెడ్డి కుటుంబానికి, వేమిరెడ్డి కుటుంబానికి ఎంతో విలువ ఉందని అన్నారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి రాజకీయాలలోకి వచ్చేటప్పుడు ఆమె గతం చెప్పుకొని రాజకీయాలలో కి వచ్చింది. ఆమెను సోమిరెడ్డి ప్రశాంతమ్మ అంటు వ్యంగ్యంగా మాట్లాడుతువా! నీ అంతు చూస్తా! అంటు తీవ్ర అసభ్య పదజాలంతో దూసించారు. ప్రజలు ఆమెను 50 వేల మెజార్టీతో గెలిపించారు. ఆమె సొంత నిదులతో అనేక సేవా కార్యక్రమాలు అభివృద్ది కార్యక్రమాలు చేస్తున్నారు. ఆమె చేసే అభివృద్ది చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నావు జాగ్రత్త అంటు హెచ్చరించారు. గతంలో అనేక మందిని నువ్వు అక్రమ కేసులు పెట్టి జైళ్ళలోకి పంపించావు. దామరమడుగులో నివాసం ఉంటున్న నా తల్లిదండ్రులను ఎంపిటిసిలుగా ఎన్నో విశిష్ట సేవలు అందించారు. నా కుటుంబంపైనే విమర్శలు చేస్తావా నీ అంతు చూస్తా... కోవూరు నియెజకవర్గంలో ప్రసన్న నీ ప్రస్దానం ఎక్కడ ప్రారంభం అయిందో అక్కడికే పంపిస్తా! ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు కోదూరు కమలాకర్‌రెడ్డి, టిడిపి పార్లమెంట్ ఉపాధ్యాక్షులు మొగళ్లూరు వెంకటశేషయ్య, టౌన్ అద్యక్షులు గుత్తా శ్రీనివాసులు, క్లష్టర్ ఇంచార్జి వింజం రామానాయుడు, మోర్ల మురళీ, దామరమడుగు నాయకులు శేషయ్య, మౌళి, మైనార్టీనాయకులు అక్తర్,రహమత్, పఠాన్ మహబూభాషా, యరటపల్లి శివకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్‌ను పరిశీలించిన తహసీల్దార్



**కోవూరు, జూన్ 17ప్రభాతవార్త :** కోవూరు మండలం పాటూరు, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. ప్రతి బీఎల్‌వో వారికి కేటాయించిన ప్రతి ఇంటికి వెళ్లి ఫారంను అందించి ఆన్‌లైన్‌లో పొందు పరిచేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు, సందేహాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ బషీర్, బీఎల్‌వోలు ఉన్నారు.

## కావలిలో ఘనంగా రిలిక్ ఎలైట్ అకాడమీ ప్రారంభం ప్రారంభించిన ఎంపి వేమిరెడ్డి, ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, జూన్ 17 ప్రభాతవార్త :** కావలి పట్టణంలో విద్య రంగానికే తలమానికం అయిన డిఆర్ ఫ్యామిలీ నుంచి విద్యారంగానికి మరో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోటీ పరీక్షల శిక్షణ అందించాలనే లక్ష్యంతో అధునాతన వసతులతో మంచి వాతావరణంలో ఏర్పాటు చేసిన రిలిక్ ఎలైట్



అకాడమీ నూతన ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా నెల్లూరు పార్లమెంటు సభ్యులకు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిలు పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడం జరిగింది. అకాడమీ నిర్వాహకులను అభినందిస్తూ విద్యార్థులకు ఉత్తమ విద్యా అవకాశాలు కల్పించే దిశగా ఈ సంస్థ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో విద్యాసంస్థల పాత్ర ఎంతో కీలకమని, పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో రిలిక్ ఎలైక్ అకాడమి మంచి వేదికగా నిలవాలని అతిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ఛైర్మెన్ దొడ్ల ప్రత్యూషరెడ్డి, డైరెక్టర్ రెష్మిరెడ్డి, విశ్వదయ విద్యాసంస్థల రెక్టర్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, విశ్వదయ టెక్నికల్ అకాడమీ ఛైర్మెన్ దొడ్ల విద్యాదర్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ లిఖిత్‌రెడ్డి, పలువురు పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## నెల్లూరు మెడికవర్ ఆసుపత్రిలో 400 కార్డియోథొరాసిక్ శస్త్ర చికిత్సలు విజయవంతం




**నెల్లూరు, జూన్ 17, ప్రభాతవార్త – వైద్యం:** నెల్లూరు మెడికవర్ ఆసుపత్రిలో 400కు పైగా కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు విజయవంత మైయ్యాయని డాక్టర్ ఎస్.విజ్ఞ చరణ్ తెలిపారు. గుండె, ఊపిరితిత్తులు, ఛాతీ సంబంధిత క్లిష్ట వ్యాధులకు అధునీత వైద్య సేవలు అందిస్తున్న మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు కార్డియోథొ రాసిక్,వాస్క్యులర్ సర్జరీ విభాగం మరో కీలక మైలురాయిని చేరుకుందన్నారు. ఆసుపత్రిలో ఇప్పటివరకు 400కు పైగా కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలు 99.5 సక్సెస్ రేట్ తో విజయవంతంగా నిర్వహించామని వెల్లడించాయి. ఈ శస్త్రచికిత్సల్లో కరోనరీ ఆర్టరీ బైపాస్ గ్రాఫ్టింగ్, హార్ట్ వాల్వ్ రీప్లేస్‌మెంట్, మినిమల్లీ ఇన్వేసివ్ కార్డియాక్ సర్జరీలు, జన్యుపరమైన గుండె లోపాల శస్త్రచికిత్సలు, థొరాసిక్, ఛాతీ సంబంధిత క్లిష్ట ఆపరేషన్లు ఉన్నాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రత్యేక కార్డియాక్ ఐసీయూ సదుపాయాలు, అనుభవజ్ఞులైన వైద్య బృందం సహకారంతో రోగులకు అత్యుత్తమ ఫలితాలు అందుతున్నాయన్నారు. ఇప్పటి వరకు 400కు పైగా కార్డియోథొరాసిక్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేయడం తమ బృందానికి గర్వకారణమన్నారు. అత్యాధునిక సాంకేతికత, నిపుణులైన వైద్యుల సేవలు మరియు రోగి కేంద్రిత చికిత్సా విధానంతో మరింత మంది రోగులకు నాణ్యమైన గుండె వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యం అన్నారు. భవిష్యత్తులో మరింత క్లిష్టమైన గుండె శస్త్ర చికిత్సలను కూడా విజయవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నెల్లూరు, పరిసర జిల్లాల ప్రజలకు అత్యాధునిక గుండె శస్త్రచికిత్స సేవలను అందిస్తూ మెడికవర్ ఆసుపత్రి ప్రాంతీయంగా విశ్వసనీయ వైద్య కేంద్రంగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ లావణ్య పాల్గొన్నారు.